thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 15 | కరీంనగర్ | మంగళవారం | 31 మార్చి, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## జాతీయ పతాకానికి 105 వసంతాలు



1921 మార్చి 31... వెంకయ్య జాతీయ జెండా రూపొందించిన దినం

6




## ఆహార కల్తీ నియంత్రణకు
# సరికొత్త వ్యవస్థ

- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బీజేపీ లక్ష్మణ్ రాజీనామా చేయాలి
- కేసీఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

"ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు."

**హైదరాబాద్, మార్చి 30:** రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ. 14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు.

మిగతా 2 లో



## ఆ క్రెడిట్ సీఎందే

- అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్

2



## కోటి ఎకరాల ఆక్రమణకు
# టెండర్

- సీఎం, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కేటీఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ

03

## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- సీఎంకు కవిత లేఖ

3



# కువైట్ ప్లాంట్‌పై ఇరాన్ దాడి

- భారతీయ కార్మికుడు మృతి!
- విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారమే లక్ష్యంగా విరుచుకుపడ్డ డ్రోన్లు
- పశ్చిమాసియా యుద్ధ జ్వాలల్లో నలుగుతున్న గల్ఫ్ దేశాలు
- భారతీయుల భద్రతపై ఆందోళన



## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

4



# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

Say NO to hate speech

## సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్!

విద్వేష ప్రసంగాలకు ఇక చెక్.. 10 ఏళ్ల వరకు జైలు శిక్ష

ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అన్న బీజేపీ

తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమో దించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసం గాలకు చెక్ పడనుంది.

## న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

02

## గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ




# 30 వేల లంచం డిమాండ్

- ఏసీబీ చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై
- ఇసుక వాహనాల విడుదల కోసం..
- 20 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత!

రూ. 30 వేల లంచం డిమాండ్ చేసి 20 వేలు తీసుకుంటూ నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల ఎస్సై హరిప్రసాద్ రెడ్డి సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు.

2




## గణపతి గన్ డౌన్ నేడే.!

లోక్ సభలో అమిత్ షా వెల్లడి.!!



5

# ఈ అంతం ఏ ఆరంభానికి..!

పాడ్యమి



31 మార్చ్, గత రెండేళ్లుగా దేశ హోం మంత్రితో పాటు మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల మంత్రులు, ముఖ్యమంత్రులు, అత్యున్నత పోలీసు అధికారులందరి నోటా పదే పదే వినపడుతున్న తేదీ. ఇటీవలి కాలంలో మరీ లొంగుబాట్లు వరదలా ముంచెత్తుతున్న ఈ రోజులలో ముఖ్యంగా మీడియా ద్వారా ఆ ఉద్యమంతో సంబంధం వున్న వాళ్లందరి నోళ్లలో నలుగుతున్న రోజు. ఆ రోజు రానే వచ్చింది. మార్చ్ 31 తో దేశంలో మావోయిజం అంతమవుతుందని హోంమంత్రి అమిత్ షా ప్రకటించాడు? దానిపై రకరకాల వ్యాఖ్యానాలు సహజంగానే వెల్లువెత్తుతున్నాయి.

మావోయిజం అంతం అవుతుందా, సాయుధ మావోయిస్టులు ఖతం అవుతారా అనే చర్చలు బుద్ధిజీవుల మధ్య గట్టిగా నలుగుతున్నాయి. యిజం ఏంటి...? యిస్టు....ఏంటి? ఆ తేడాలపై జరుగుతున్న కసరత్తులు సరేసరి. మనకు ఇక్కడ కావలసింది, ఈ దేశంలో మావోయిస్టులు 31 మార్చ్ తో అంతమవుతున్నారా....! ఈ అంతం ఏ ఆరంభానికి సంకేతం....? ఈ ప్రశ్నకు జవాబు చెప్పేదెవరు ..... ?

మిగతా 5 లో

- ఏపీ, తెలంగాణ షెడ్యూల్ విడుదల
- మే 1 నుంచి ఏపీలో.. మే 11 నుంచి తెలంగాణలో ఇళ్ల సర్వే
- తొలిసారిగా 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'కు అవకాశం..
- 16 భాషల్లో మొబైల్ యాప్ ద్వారా సేకరణ
- సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ

## రెండు విడతల్లో
# జనగణన

**ఢిల్లీ, మార్చి 30:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు విడతల్లో ఈ జనగణన జరుగుతుందని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. ఈసారి మొత్తం రూ. 11,718 కోట్ల భారీ వ్యయంతో, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ 16 భాషల్లో మొబైల్ యాప్ ద్వారా వివరాలను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు.

మిగతా 2 లో

చురకలు

మంగళవారం 31 మార్చి 2026



# రెండు విడతల్లో జనగణన

## ఏపీ, తెలంగాణ షెడ్యూల్ విడుదల

**మే 1 నుంచి ఏపీలో.. మే 11 నుంచి తెలంగాణలో ఇళ్ల సర్వే**

**సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ**

**ఢిల్లీ, మార్చి 30:** దేశవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జనగణన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు విడతల్లో ఈ జనగణన జరుగుతుందని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. ఈసారి మొత్తం రూ. 11,718 కోట్ల భారీ వ్యయంతో, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ 16 భాషల్లో మొబైల్ యాప్ ద్వారా వివరాలను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇళ్ల సర్వే జరుగుతుందని, దీనికి ముందుగా ఏప్రిల్ 16 నుంచి 30 వరకు ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'కు అవకాశం కల్పించినట్లు వివరించారు. అలాగే తెలంగాణలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ఇళ్ల సర్వే నిర్వహిస్తారని, ఇక్కడ ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వయంగా వివరాలు నమోదు చేసుకోవచ్చని షెడ్యూల్ ఖరారు చేశారు. తొలి విడతలో భాగంగా గృహాల లెక్కింపు చేపడతారని, ఇందులో ఇంటి పరిస్థితి, వసతులు, ఆస్తులు మరియు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు సంబంధించిన వివరాలతో కూడిన మొత్తం 34 ప్రశ్నలకు ప్రజలు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెండో దశలో కులగణనతో పాటు వలసలు, సంతానోత్పత్తి వంటి సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సమాచారాన్ని సేకరిస్తామని రిజిస్ట్రార్ జనరల్ వివరించారు. ప్రజలు అందించే సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. ఎన్యుమరేటర్లు తమ సొంత మొబైల్స్ ద్వారానే డేటాను సేకరిస్తారని, ప్రజలు నేరుగా https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా కూడా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఈ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి కానుంది.

# న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

**అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్, మార్చి 30:** న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకొస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభలో వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పట్టపగలే వారిని హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ప్రోద్బలంతోనే వారు హత్యకు గురైనట్లు ఆక్షేపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ బిల్లు తీసుకొస్తున్నట్లు చెప్పారు.

# సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

**అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్**



**హైదరాబాద్, మార్చి 30:** సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాల్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్..సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చుచేశామని చెప్పారు.ఇపుడు పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు. ఎంత ఖర్చైనా సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల ఖాతాలో ఇప్పటి వరకు రూ. 40 వేల కోట్లు వేశామన్నారు ఉత్తమ్. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకువేస్తున్నామని తెలిపారు.అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

**జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్**

**హైదరాబాద్, మార్చి 30:** క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఆయన లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంలోని సౌకర్యాలను ఎంపీ రఘునందన్ రావు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రిలో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఇందులో ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే.. తగిన చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు.

# 30 వేల లంచం డిమాండ్

**ఏసీబీ చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై**

**నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల ఎస్సై హరిప్రసాద్ రెడ్డి సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. వాహనాల విడుదల కోసం బాధితుడి నుంచి రూ.30 వేల లంచం డిమాండ్ చేస్తూ, రూ. 20 వేలు తీసుకుంటుండగా మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 5న ఇసుక సరఫరా చేస్తున్న ఒక వ్యక్తికి చెందిన ట్రాక్టర్, జేసీబీని ఎస్సై హరిప్రసాద్ రెడ్డి పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి వివరాలను జిల్లా మైనింగ్ అధికారులకు పంపగా, వారు ఆ వాహనాలకు 60 వేల జరిమానా విధించారు. బాధితుడు ఈ నెల 7నే జరిమానా మొత్తాన్ని చెల్లించి, వాహనాలను విడుదల చేయాలని కోరుతూ మైనింగ్ అధికారుల పత్రాలను ఎస్సైకి అందజేశాడు. అయితే, మైనింగ్ ఫైన్ చెల్లించినా సంబంధం లేదని, తనకు విడిగా రూ. 30 వేలు లంచం ఇస్తేనే వాహనాలను వదిలిపెడతానని ఎస్సై భీష్మించుక కూర్చున్నాడు. ఎస్సై వేధింపులు భరించలేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఎస్సై లంచం డిమాండ్ చేస్తున్న వాయిస్ రికార్డింగ్‌లతో సహా అన్ని ఆధారాలను అధికారులకు సమర్పించాడు. ఈ క్రమంలో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రూ. 20 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ బృందం మెరుపు దాడి చేసి పట్టుకుంది. ఎస్సై హరిప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు. అవినీతికి పాల్పడే అధికారులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్
- బిల్లును వ్యతిరేకించిన బిజెపి

**హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించడం, ఈ నేరాలను నాన్-బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.



# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు.గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు.

# పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, మార్చి 30:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పొంగులేటిని బర్తరఫ్ చేయండి

**గవర్నర్‌కు బిఆర్ఎస్ విజ్ఞప్తి**

**హైదరాబాద్:** ప్రతిపక్షాన్ని సీఎం బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

మొదటి పేజీ తరువాయి

వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు.



నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

# కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

- సీఎం, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కేటీఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ



**హైదరాబాద్, మార్చి 30:** సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- గతంలో పీసీసీ చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

**హైదరాబాద్, మార్చి 30:** జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.



# నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

**సింగరేణికి సమంబందించి పలు సూచనలు చేసిన కాగ్**

**హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.





# అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

**హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే**

**ప్రతిపక్ష నేత మధుసూదనాచారి**

**హైదరాబాద్, మార్చి 30:** రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.





# చిత్తశుద్ధి ఉంటే ఓవైసీపై చర్య తీసుకోండి!

**తెలంగాణ ప్రభుత్వానికి బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సవాల్**

**రాజ్యసభలో ఓబీసీ అంశంపై విపక్షాల అడ్డంకులు**

**న్యూఢిల్లీ, మార్చి 30:** హేట్ స్పీచ్ బిల్లుపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. మొదట అక్బరుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వానికి అటువంటి చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని తాను ప్రస్తావిస్తే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు అడ్డుకున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు.

**ఓబీసీల గొంతు నొక్కుతున్నారు**

సోమవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, అన్ని విపక్ష పార్టీలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశాయని లక్ష్మణ్ ఆరోపించారు. ఓబీసీ జాబితాలో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. దీనివల్ల అసలైన ఓబీసీలు వెనకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే సైతం తనను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారని తెలిపారు.

**ఓట్ల కోసం రిజర్వేషన్లు**

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను ఒక కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చి 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని లక్ష్మణ్ చెప్పారు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నారని విమర్శించారు. కేవలం ఒక వర్గం ఓట్ల కోసమే పార్టీలు ఇలా కక్కుర్తి పడుతున్నాయని మండిపడ్డారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు ఉన్న స్థానాల్లో కూడా ముస్లింలే పోటీ చేశారని ఎంపీ లక్ష్మణ్ గుర్తు చేశారు.

# కృష్ణా నదిలో దూకి కౌలు రైతు ఆత్మహత్య

**రెండేళ్లుగా సాగులో నష్టాలు.. హైదరాబాద్‌కు వలస**

**పిల్లలను చూసి వెళ్తూ ప్రాణాలు తీసుకున్న నాగరాజు**

**నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో విషాదం**

**నారాయణపేట, మార్చి 30:** నారాయణపేట జిల్లాలో తీరని విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. కన్న భూతల్లిని నమ్ముకుని సాగు చేసిన ఆ రైతుకు గత 2 ఏళ్లుగా ప్రకృతి కన్నెర్ర చేయడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. చివరికి కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణ మండలంలోని గుడేబడ్లూరులో సోమవారం వెలుగుచూసింది. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో పెను విషాదం నెలకొంది. గుడేబడ్లూరు టై రోడ్డు చెక్‌పోస్టు వద్ద నివసించే నాగరాజు (55) కృష్ణా పరివాహక ప్రాంతంలో భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత 2 ఏళ్లుగా ఆయన పండించిన వరి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి ఇవ్వలేదు. వాతావరణ మార్పులు, తెగుళ్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన నాగరాజుకు అప్పులు కొండలా పెరిగిపోయాయి. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఈ విడత సాగుకు దూరంగా ఉన్నాడు.

**వలస వెళ్లినా తీరని వేదన..**

సాగు కోసం చేసిన అప్పులు తీర్చేందుకు, తన కుటుంబాన్ని పోషించుకోవడానికి వేరే దారి లేక నాగరాజు హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ చిన్న చిన్న పనులు చేస్తూ కూలీగా మారాడు. 2 రోజుల క్రితమే తన భార్యాపిల్లలను చూసేందుకు సొంత గ్రామానికి వచ్చాడు. తన కుటుంబాన్ని చూసి సంతోషంగా వెనక్కి వెళ్తాడనుకున్న నాగరాజు.. మనసులో ఉన్న అప్పుల బాధను దిగమింగుకోలేకపోయాడు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కృష్ణ బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో నుంచి నాగరాజు మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పుల బాధ భరించలేకనే తన భర్త ప్రాణాలు తీసుకున్నాడని మృతుడి భార్య పోలీసుల వద్ద విలపించిన తీరు అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. ఈ ఘటనతో గుడేబడ్లూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తీరని శోకంలో ఉన్న ఆ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని స్థానికులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# నగరంలో డ్రగ్స్ కలకలం


**మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్**



**హైదరాబాద్,మార్చి30 :** హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఆటో బోల్తా: తల్లీ కుమారుడు మృతి

**కామారెడ్డి,మార్చి30 :** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల శివారులో ఘోర ప్రమాదం జరిగింది. ఆటో బోల్తాపడిన ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వేడుకకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.



సంపాదకీయం

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య!

ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయిం పులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్దరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెటెక్కుతారు. నదీ జలాలలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుఉతంది.



# ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్, మార్చి 30: ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.




# కువైట్ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

- భారతీయ కార్మికుడు మృతి!
- విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారమే లక్ష్యంగా విరుచుకుపడ్డ డ్రోన్లు
- పశ్చిమాసియా యుద్ధ జ్వాలల్లో నలుగుతున్న గల్ఫ్ దేశాలు
- భారతీయుల భద్రతపై పెరుగుతున్న ఆందోళన



**ఢిల్లీ:** పశ్చిమాసియాలో ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు పెను శాపంగా మారుతున్నాయి. కువైట్‌లోని ఒక కీలక విద్యుత్ మరియు నీటి శుద్ధీకరణ ప్లాంట్‌పై ఇరాన్ నిర్వహించిన డ్రోన్ దాడుల్లో ఒక భారతీయ కార్మికుడు (టెక్నీషియన్) మరణించడం తీవ్ర విషాదాన్ని నింపింది. కువైట్ విద్యుత్, నీరు, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు చెందిన ప్రధాన ప్లాంట్‌లోని సర్వీస్ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. డ్రోన్ నేరుగా భవనాన్ని ఢీకొనడంతో కంట్రోల్ రూమ్ తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ ఘటనలో విధి నిర్వహణలో ఉన్న భారతీయ పౌరుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొంతమంది సిబ్బంది గాయపడినట్లు సమాచారం. ఈ దాడి కారణంగా కువైట్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా తన యుద్ధనౌకలు, సైనిక బలగాలను గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి తమపై దాడులకు ఉపయోగిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే అమెరికాకు సహకరిస్తున్న దేశాల ఆర్థిక మూలాలను, ముఖ్యంగా విద్యుత్ మరియు నీటి ప్లాంట్లపై దాడులు చేస్తామని ఇరాన్ చేసిన హెచ్చరికలు ఇప్పుడు వాస్తవ రూపం దాల్చుతున్నాయి.


### భారతీయ కార్మికుల భద్రతపై నీలి నీడలు

పశ్చిమాసియాలో సాగుతున్న ఈ భీకర యుద్ధంలో ఇప్పటివరకు సుమారు 8 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత గురువారం యూఏఈలో జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయుడు మరణించగా, ఇప్పుడు కువైట్‌లో మరో ప్రాణం పోవడం గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య కాకుండా కువైట్, యూఏఈ, బహ్రెయిన్ వంటి దేశాలకు విస్తరిస్తుండటం అంతర్జాతీయ సమాజాన్ని కలవరపెడుతోంది.

# ఢిల్లీ పోలీసులకు చిక్కిన లష్కరే ఉగ్రవాది

- బంగ్లాదేశ్ కేంద్రంగా భారత్‌పై కుట్ర!
- 26/11 మాస్టర్ మైండ్ హాఫీజ్ సయీద్‌తో షబ్బీర్ అహ్మద్ లోన్‌కు సంబంధాలు
- తీహార్ జైలు నుంచి విడుదలయ్యాక బంగ్లాలో నెట్‌వర్క్ పునర్నిర్మాణం

**ఢిల్లీ, మార్చి 30:** భారతదేశంపై దాడులకు వ్యూహరచన చేస్తున్న లష్కరే తోయిబా కీలక ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ లోన్‌ను ఢిల్లీ పోలీసులు వ్యూహాత్మకంగా అరెస్ట్ చేశారు. శ్రీనగర్‌కు చెందిన షబ్బీర్, పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆదేశాల మేరకు లష్కరే తరపున దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అధికారులు ధృవీకరించారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో తలదాచుకున్న ఇతడిని నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. షబ్బీర్ అహ్మద్ లోన్ బంగ్లాదేశ్‌లో ఉంటూ భారత్‌పై దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ముఖ్యంగా భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ జాతీయులను ఉగ్రవాద కార్యకలాపాల్లోకి నెట్టడం ఇతడి ప్రధాన ఎత్తుగడ. ఇలా చేయడం ద్వారా దాడుల వెనుక పాకిస్థాన్ పేరు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. 2007లోనే భారీ ఆయుధాలతో పట్టుబడిన షబ్బీర్, 2018 వరకు తీహార్ జైల్లో శిక్ష అనుభవించాడు. 2018లో బెయిల్ పొందిన తర్వాత భారత్ నుంచి తప్పించుకుని బంగ్లాదేశ్ వెళ్ళిపోయాడు. అక్కడ మళ్లీ లష్కరే నెట్‌వర్క్‌ను పునర్నిర్మించి, విధ్వంసకర దాడులకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా పెంచారు. ముంబై దాడుల



సూత్రధారి హాఫీజ్ సయీద్‌తో కూడా ఇతనికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. షబ్బీర్ అరెస్టుతో దేశంలో జరగబోయే పెద్ద ప్రమాదం తప్పిందని భద్రతా దళాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం నిందితుడిని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

### స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు

**హైదరాబాద్, మార్చి 30 :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్స్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ఢమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ఏఐ వీడియోలతో జాగ్రత్త

- అస్సాం బీజేపీ కార్యకర్తలకు ప్రధాని మోదీ హెచ్చరిక!
- 'మేరా బూత్ సబ్‌సే మజబూత్' కార్యక్రమంలో నమో యాప్ ద్వారా దిశానిర్దేశం
- - ఏప్రిల్ 9న అస్సాం అసెంబ్లీ ఎన్నికలు.. మే 4న ఫలితాలు

**ఢిల్లీ, మార్చి 30:** అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం 'నమో యాప్' ద్వారా నిర్వహించిన 'మేరా బూత్ సబ్‌సే మజబూత్ సంవాద్' కార్యక్రమంలో పాల్గొన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అస్సాం బీజేపీ కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో బీజేపీ-ఎన్డీయే కూటమి మూడోసారి ఘనవిజయం సాధించేందుకు కార్యకర్తలు చేస్తున్న కృషిని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఎన్నికల సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించే నకిలీ వీడియోల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రధాని కార్యకర్తలను హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు సమాచారం ప్రజాస్వామ్య ప్రక్రియకు ముప్పు కలిగిస్తుందని, ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అస్సాంలో అస్థిరత, అశాంతి ఉండేవని.. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువత ఆ పరిస్థితులను గమనించాలని



కోరారు. శాంతి, సుస్థిరత ఉంటేనే నిలకడైన అభివృద్ధి సాధ్యమని ప్రధాని స్పష్టం చేశారు.

### అస్సాం ఎన్నికల ముఖచిత్రం - 2026

నియోజకవర్గాల పునర్విభజన అనంతరం అస్సాంలో జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవే కావడం విశేషం. మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో బీజేపీకి 64 మంది సభ్యుల బలం ఉండగా, మిత్రపక్షాలైన ఏజీపీ (9), యూపీపీఎల్ (7), బీపీఎఫ్ (3) లతో కలిసి కూటమి పటిష్టంగా ఉంది. విపక్షంలో కాంగ్రెస్‌కు 26 మంది, ఏఐయూడీఎఫ్‌కు 15 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ప్రధాని పిలుపునిచ్చారు.

# ఈ అంతం ఏ ఆరంభానికి..!

**మొదటి పేజీ తరువాయి..**

సాయుధంగా ప్రభుత్వానికి లొంగిపోయిన మావోయిస్టులు జవాబు చెపుతారా...చూడాలి మరి! అరెస్టయిన మావోయిస్టులు చెప్పే ప్రసక్తే వుండకపోవచ్చు. వారు అరెస్టే అంటున్నారు, వారు తమ పార్టీపై నిషేధం ఎత్తివేయాలనీ కేంద్రాన్ని కోరుతున్నారు. కాబట్టి వారి లెక్క ప్రకారం మావోయిస్టులు వున్నట్టే...! వారు కోరినట్టు నిషేధం ఎత్తివేసినా, లేదా వారు చట్ట ప్రకారం కటకటాల వెనుకకు వెళ్లినా వారంతా మావోయిస్టులుగానే లెక్కలోకి వస్తారు. ఐడ్రీం మురళీధర్ గారి వీడియోలో వున్న వ్యక్తి నిజమైన సాయుధ మావోయిస్టు అయితే ఇప్పటికీ అడవిలో వున్న తమకు దేవ్ జీ తో సంబంధాలు వున్నాయనీ, చెపుతున్న ఒక లైవ్ (వీడియో) వైరల్ అవుతోంది. సో, వీటన్నింటిపై అమిత్ షా ముందు లోకసభలో ఆ తరువాత రేపు మీడియా ముందు తుది తీర్పు వెలువరించాలి.

ఈ రోజు 30 మార్చ్. నేడే లోకసభలో ఓటింగ్ కు అవకాశం లేని ఆదేశం కింద ఈ విషయంపై చర్చ జరుగనుంది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ లో విజయం కోసం ఊపిరాడని విధంగా తలమునకలైన హోం మంత్రి మావోయిస్టు రహిత భారతంపై లోకసభకు అందచేసే నివేదిక, దాని ఆధారంగా ప్రజల ముందు ఆయన ప్రకటించే నిర్ణయం కోసం సర్వత్రా ఒక ఉత్కంఠత నెలకొంది.

ఇప్పటికే ఈ విషయంలో కుప్పలు తెప్పలుగా వస్తున్న వార్తలు, కథలు, కథనాలు సహ వివిధ రూపాలలోని సమాచారంతో సోషల్ మీడియా బరువెక్కిపోతోంది. దానితో పాటు లొంగిపోయిన నాయకులు భవిష్యత్తులో ఏం చేస్తారు అనే మీమాంస అనేక మందిని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజకీయ పార్టీల వారిని సతాయిస్తున్న సమస్య. దానిపై లొంగిపోయిన వారి నుండి వస్తున్న జవాబు వీరి వేగిరపాటును పరీక్షిస్తోంది. ముందు పోలీసుల భద్రతా వలయం నుండి బయటకు వస్తే కానీ, ఏం చేయడమనేది చెప్పలేమని కొందరు నాయకులు అంటుంటే, మరి కొందరు ఏ పార్టీలో చేరేది లేదు, ప్రజల కోసం తుదివరకూ పని చేస్తామని హామీలు ఇస్తున్నారు .మరోవైపు విప్లవాభిమానులు మావోయిస్టులు పరస్పరం ఆరోపణలు మానుకొని ఐక్యం కావాలనే ఆదర్శప్రాయ సందేశాలు అందిస్తున్నారు.

పై నేపథ్యంలో, అమిత్ షా తేల్చాల్సిన మరో సమస్య ఏమంటే, చట్టబద్ధంగా ప్రజల మధ్య పని చేస్తామనే వారిని ఆ పేరుతోనే పని చేయడానికి అనమతిస్తారా....? అనే దానికి నిజానికి లోపాయికారిగానే జవాబు ఇవ్వాల్సి వుంటుంది. ఆయనెవరు, వద్దనడానికి? చట్టబద్ధంగా పని చేసేవారు తమ పార్టీకి ఏ పేరైనా పెట్టుకుంటారు, అలా పెట్టుకోకూడదనీ ఏ చట్టంలో వుందనీ ఎదురు ప్రశ్న వేయడం పెద్ద సమస్యేం కాదు, కానీ, 'కీడెంచి మేలెంచాలి' అనే విధంగా ఆలోచించే వారు, ''వేడి పాలు తాగి నాలుక కాల్చుకున్న పిల్లి చల్ల సైతం ఊదుతూ ఊదుతూ తాగినట్టు'' చాలా లోతుగా ఆలోచించే అడుగు ముందుకు వేస్తారు. అదే విజ్ఞత అనిపించుకుంటుంది.

లొంగుబాట్లకు దారి చూపిన మల్లోజుల మాత్రం తన 22 పేజీల అప్పీల్ పత్రంలో బయటకు వెళ్లిన తరువాత ముందు మారిన పరిస్థితులను అధ్యయనం చేయాల్సి వుంటుందనీ నింపాదిగా చెప్పేశాడు. కానీ, ప్రశ్నించే వారి తొందర వారిదే. వారి ఆశలన్నీ పస లేని పార్లమెంటు పార్టీల పంచన పడివుండి సాధించేదేమీ లేదనే కంక్లూజన్ తోటే, కొత్త శక్తులకు స్వాగతం పలుకుతున్నారు. వారి దశాబ్దాల త్యాగాలను సొమ్ము చేసుకోవడం కోసం ఆయా పార్టీల నాయకులు అర్రులు చాస్తున్నారు. మరీ మన దేశంలో లీడర్ లెస్ ఉద్యమాలు రంగం మీదికి వచ్చి వున్న నేపథ్యంలో...... వారి ఆందోళన సమంజసమే అనిపిస్తుంది.

సాయుధ మావోయిస్టుల ముగింపులో ప్రధాన పాత్రదారులు ఎవరు? ఈ క్రెడిట్ ఎవరికి దక్కుతుంది? సహజంగానే పాలకులంతా అమిత్ షాకు పట్టం కడుతుంటే, మావోయిస్టులు ససేమిరా అంటున్నారు. లొంగిపోయిన వారైనా, అరెస్టంటూ చెప్పుకుంటున్నవారైనా, తమ పార్టీ చేసిన లోపాలతో పార్టీ, ఉద్యమం బలహీనపడి ఓటమికి చేరువ కావడం ప్రధాన కారణం అంటున్నారు. దానికి వివిధ ఇంటర్వ్యూలలో మల్లోజుల పదార్థంలో మార్పుకు దారితీసేవి అంతర్గత వైరుధ్యాలు వాటికి తోడు బహిర్గత కారణాలంటూ తాత్వికంగా విశ్లేషించి చెప్పడం చూస్తున్నాం.

ఆ లెక్కన ప్రధానంగా పార్టీ స్వయం కృతాపరాధాలతోనే 'కగార్' కు స్వాగతం పలికింది. బాహ్య కారణంగా అమిత్ షా కు క్రెడిట్ దక్కుతుంది. ఇందులో ఆధునిక టెక్నాలజీ పాత్ర ఎంత...? దీనిని అనవసరంగా అందలం ఎక్కిస్తున్న వారూ వున్నారు. ఏ యుద్ధంలోనైనా ఆధునిక టెక్నాలజీ పాత్రను చూస్తుంటే, దాని ప్రాముఖ్యత ఎంతటిదైనా, అది నిర్ణయాత్మకమైనది మాత్రం కాదు. ఈరోజు ఇరాన్, గాజాలు ఎంత దెబ్బతినిపోయినా, పదాతి దళాలు ఆ భూభాగాలలోకి వెళ్లకుండా, ఎంతటి ఆధునిక అమెరికా అయినా, చేసేదేమీ వుండదనీ యుద్ధాల చరిత్రలు నిరూపిస్తున్నాయి.

31 మార్చ్ తరువాత చట్టబద్ధంగా బయటికి వచ్చే మాజీ మావోయిస్టులు ఒక గద్దర్ లాగా, మరో రాహుల్ గాంధీలాగా ఎటు పోయినా భారత రాజ్యాంగాన్ని చేతబూని ప్రజల మధ్యకు వెళ్తారా, లేక రాజ్యాంగ నిర్మాతగా మన్ననలు అందుకుంటున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ తానే స్వయాన పార్లమెంట్ లో చెప్పిన విషయ పరిజ్ఞానంతో ''నువ్వు రాజ్యాంగ నిర్మాతవని జనం నాతో అంటుంటారు. నా సమాధానం ఏమిటంటే, నేను ఒక బాడుగ గుర్రాన్ని మాత్రమే. నా ఇష్టానికి వ్యతిరేకంగా నన్ను చెయ్యమన్నది నేను చేశాను....నేను రాజ్యాంగాన్ని రచించానని నా స్నేహితులు నాతో అంటుంటారు. కానీ ఈ రాజ్యాంగాన్ని తగులబెట్టే మొట్టమొదటి వ్యక్తిని నేను అని స్పష్టంగా చెప్పడానికి సిద్ధంగా వున్నాను. ఈ రాజ్యాంగం నాకు అక్కరలేదు. ఇది ఎవరికీ ప్రయోజనకరం కాదు'' (1953లో పార్లమెంట్ లో మాట్లాడుతూ అన్న మాటలు) వ్యవహరిస్తారా....వారి భవిష్యత్ ఆచరణే తేల్చాలి. మన దేశంలో ఆపదలో వున్నవారికి, అధికారాన్ని కోరుకునే వారందరికి భారత రాజ్యాంగం రక్షగా, ఆయుధంగా మాత్రము ఉంటున్నది.

ఆకలి, అసమానతలు, వివక్ష, అన్యాయం, పేదరికం, అవిద్య ఇంకా అనేకానేక సామాజిక రుగ్మతలు వున్నంతవరకూ పోరాటాలు వుంటాయనీ, ప్రజలు తిరుగబడుతారనీ, బేబీ బ్రూమర్ లకు అర్థం కాని విషయాలు జెన్ జీ లకు అర్థం అవుతుందనీ, గుణపాఠాలు తీసుకుంటారనీ సెలవిచ్చేవారు లేకపోలేదు. అది చాలా సునాయసంగా చేసే పని. కానీ కార్యాచరణలో కాలు కదిపేవాడికే దారిలో ముళ్లా, రాళ్లా, రప్పలా, కంకరా, కత్తులా అనేది అర్థమవుతుంది. వాళ్లే భవిష్యత్తు తరాలకు గుణపాఠంగా నిలుస్తారు.

# గణపతి గన్ డౌన్ నేడే.!

**లోక్ సభలో అమిత్ షా వెల్లడి.!!**

**చురకలు ప్రత్యేక ప్రతినిధి**



–కేంద్ర ప్రభుత్వం ఊహించిన విధంగా మిలిటరీ పరంగా మావోయిస్టు పార్టీని అణిచివేయడంలో సక్సెస్ అయింది. కగార్ ను ప్రయోగించి పార్టీని అదుపులో తీసుకురావడంలో అమిత్షా చేసిన సైనిక చర్య విజయవంతం అయింది. రెండేళ్ల క్రితం తలపెట్టిన ఆపరేషన్ కగార్ దెబ్బకు వేలాదిమంది మావోయిస్టులు లొంగిపోయారు.ఓ 1000 మంది ని చంపడానికి పోలీసులు ప్రయత్నించి సపలం అయ్యారు.ఇక చివరిగా మిగిలిన ఆ పార్టీ మాజీ చీఫ్ సెక్రటరీ గణపతి మార్చి 31 నాడు ఢిల్లీ పోతున్నట్లు ప్రచారం జరుగుతుంది .ఈ మేరకు లోక్సభలో సోమవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మావోయిస్టు పార్టీ ముఖ్య నాయకుడు ఒకరు కొన్ని గంటల్లో లొంగిపోతున్నట్లు ప్రకటించడం చూస్తే గణపతి ని ఉద్దేశించి అమిత్ షా మాట్లాడి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. మావోయిస్టు పార్టీలో గణపతికి మించిన ముఖ్య నాయకులు ఎవరు మిగిలి లేరు .కేంద్ర కమిటీలో ఝార్ఖండ్ కు చెందిన మిసిరి బిశ్రా ,వరంగల్ జిల్లాకు చెందిన విశ్వనాథ్ సాగర్ లాంటి ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు మరో 38 మంది పార్టీ సభ్యు మాత్రమే మిగిలి ఉన్నారు. 100 లోపు మావోయిస్టులు చత్తీస్గఢ్ జార్ఖండ్ లో ఉన్నారు .చివరి దశకు చేరుకున్న మావోయిస్టు ఉద్యమంలో గణపతి సరెండర్ తో మావోయిస్టు పార్టీ శకం ముగిసినట్లు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అధికారికంగా మార్చి 31న ప్రకటించనున్నారు.మిగిలిన వారు లొంగిపోవచ్చు లేదా వారిని అణిచివేయడానికి కావాల్సిన శక్తి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నాయి .అటు ఇటు కొద్దీ తేడాతో మిగిలిన మావోయిస్టులను ఎన్కౌంటర్ పేరుతో కాల్చి చంపడానికి ప్రభుత్వాలు పెద్దగా వెనుకడుగు వేయకపోవచ్చు. గణపతి లొంగుబాటుతో తెలంగాణ మావోయిస్టు పార్టీ పెద్దదిక్కు గా కనిపిస్తున్న గణపతి...అటు తీవ్రమైన అనారోగ్యం వయోభారంతో సహచరులు మోస్తున్నట్లు ప్రచారం కూడా జరుగుతున్నందున గణపతి ప్రభుత్వానికి లొంగిపోయిన పెద్దగా ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడే శక్తులు ఎవరు ఉండకపోవచ్చు. కొన్ని గంటల్లో గణపతి లొంగుబాటు వ్యవహారం కొలిక్కి రానున్నది.

# సమస్యలు ఆలకించి..
# తక్షణ పరిష్కారానికి ఆదేశించి..

- **ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి..**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**
- **ప్రజావాణి ఫిర్యాదులు 225**



**కరీంనగర్, మార్చి 30:** ప్రజావాణి అర్జీలపై విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కి వస్తారని, ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్, డి ఆర్ డి ఓ శ్రీధర్, గృహ నిర్మాణశాఖ పిడి శ్రీనివాసు, పలు అధికారులు పాల్గొన్నారు.

# మార్చి 31... ప్రపంచ బ్యాకప్ దినోత్సవం

మానవ పరిణామ క్రమంలో సమాచారం ఎప్పుడూ ఒక శక్తిగానే ఉంటూ వచ్చింది. అక్షరం పుట్టిన నాటి నుండి నేటి అల్గారిథంల కాలం వరకు, సమాచారమే నాగరికతలను నడిపించింది. అయితే, ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఆ సమాచారమే అత్యంత విలువైన 'డేటా'గా, నవయుగ 'చమురు'గా రూపాంతరం చెందింది. ఈ డిజిటల్ విప్లవంలో సమాచారమే సంపదగా, అధికారం కావడంతో దానిని భద్రపరచుకోవడం అనేది వ్యక్తిగత మరియు జాతీయ స్థాయిలలో ఒక అనివార్యమైన అవసరంగా మారింది. ఈ నేపథ్యంలోనే, ప్రజలలో డేటా భద్రతపై చైతన్యం నింపేందుకు ప్రతి సంవత్సరం మార్చి 31వ తేదీని "ప్రపంచ బ్యాకప్ దినోత్సవం"గా నిర్వహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం మన దైనందిన జీవితంలో నరనరాన జీర్ణించుకుపోయిన ప్రస్తుత తరుణంలో, డేటా భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే అది ఊహించని నష్టాలకు దారితీస్తుంది. ఈ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు, మన డిజిటల్ జీవితానికి మనం వేసుకునే భద్రతా కవచం వంటిది. మన స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, సర్వర్లలో నిక్షిప్తమై ఉన్న సమాచారం ఏ క్షణమైనా అదృశ్యం కావచ్చని, దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలని హెచ్చరించడమే ఈ రోజు యొక్క పరమార్థం.

ప్రపంచ బ్యాకప్ దినోత్సవం ఆవిర్భావం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. 2011వ సంవత్సరంలో ఒక ప్రముఖ సామాజిక మాధ్యమ వేదికపై జరిగిన చర్చ దీనికి నాంది పలికింది. ఒక సామాన్యుడు తన కంప్యూటర్‌లోని అమూల్యమైన డేటాను కోల్పోయిన విషాదాన్ని పంచుకోగా, అది ప్రపంచ వ్యాప్తంగా వందలాది మందిని కదిలించింది. అందరూ తమ జీవితాల్లోని ఇలాంటి డేటా నష్టాలను ఏకరువు పెట్టడంతో, ఈ సమస్య ఎంత తీవ్రమైనదో ప్రపంచానికి అర్థమైంది. దీంతో డిజిటల్ భద్రతపై ప్రపంచ వ్యాప్త అవగాహన అవసరమని భావించి మార్చి 31ని ఎంచుకున్నారు. ఏప్రిల్ 1న వచ్చే 'ఏప్రిల్ ఫూల్' రోజున ఎవరూ తమ డేటాను కోల్పోయి నిజంగా 'ఫూల్' కాకూడదనే ఉద్దేశంతో, దానికి ముందు రోజైన మార్చి 31న "డోంట్ బి ఎన్ ఏప్రిల్ ఫూల్" అనే వ్యంగ్యాత్మక నినాదంతో ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ చమత్కారం వెనుక ఒక గంభీరమైన హెచ్చరిక దాగి ఉంది. మీ డేటాను బ్యాకప్ చేయక పోవడం అంటే, మీ డిజిటల్ ఉనికిని ప్రమాదంలో పడేయడమేనని ఇది స్పష్టం చేస్తోంది.

డేటా నష్టపోవడానికి కారణాలు పరిమితం కావు, అవి అనంతం. భౌతిక పరికరాల వైఫల్యం నుండి అత్యాధునిక సైబర్ దాడుల వరకు అనేక ముప్పులు పొంచి ఉన్నాయి. హార్డ్ డిస్క్ డ్రైవ్‌లు లేదా ఎస్.ఎస్.డిలు ఎప్పుడైనా సాంకేతిక లోపంతో ఆగిపోవచ్చు. సాఫ్ట్‌వేర్ క్రాష్ కావడం, అనుకోకుండా కీలకమైన ఫైళ్లను డిలీట్ చేయడం వంటివి నిత్యం జరిగే పొరపాట్లు. వీటికి తోడు ర్యాన్సమ్‌వేర్ వంటి భయంకరమైన వైరస్ దాడులు నేడు సంస్థలను గడగడలాడిస్తున్నాయి. హ్యాకర్లు మన డేటాను లాక్ చేసి, దానిని తిరిగి ఇచ్చేందుకు భారీగా డబ్బు డిమాండ్ చేస్తున్నారు. గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పది సెకన్లకు ఒక ర్యాన్సమ్‌వేర్ దాడి జరుగుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రకృతి విపత్తులైన వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మనం భౌతికంగా భద్రపరిచిన పరికరాలు కూడా కాలిపోవచ్చు లేదా కొట్టుకుపోవచ్చు. ఇలాంటి సమయాల్లో డేటా బ్యాకప్ లేకపోతే ఒక వ్యక్తి జీవితకాల కష్టం లేదా ఒక సంస్థ దశాబ్దాల చరిత్ర నిమిషాల్లో బూడిదైపోతుంది. దాదాపు 30 శాతం మంది వినియోగదారులు తమ జీవితంలో కనీసం ఒక్కసారైనా డేటా నష్టాన్ని ఎదుర్కొంటున్నారని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, హార్డ్‌వేర్ మార్చుకోవచ్చు కానీ, అందులో పోయిన డేటాను తిరిగి సృష్టించడం అసాధ్యం.

బ్యాకప్ అంటే కేవలం ఒక ఫైలును కాపీ చేయడం మాత్రమే కాదు, అది ఒక క్రమశిక్షణతో కూడిన ప్రక్రియ. దీనిని ప్రధానంగా భౌతిక నిల్వ మరియు క్లౌడ్ నిల్వ అనే రెండు విధాలుగా విభజించవచ్చు. హార్డ్ డిస్క్, పెన్ డ్రైవ్ వంటి పరికరాలు వ్యక్తిగత నియంత్రణలో ఉంటాయి. కానీ, ప్రస్తుత క్లౌడ్ కంప్యూటింగ్ యుగంలో గూగుల్ డ్రైవ్, వన్‌డ్రైవ్, డ్రాప్‌బాక్స్ వంటి సేవలు విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. ఇవి ఆటోమేటిక్ బ్యాకప్ సౌకర్యాన్ని కల్పిస్తూ, డేటాను ఎక్కడి నుండైనా యాక్సెస్ చేసుకునే వెసులుబాటును ఇస్తున్నాయి. బ్యాకప్ చేసే




విధానంలో కూడా ఫుల్ బ్యాకప్, ఇన్‌క్రిమెంటల్ బ్యాకప్ మరియు డిఫరెన్షియల్ బ్యాకప్ అనే మూడు కీలక పద్ధతులు ఉన్నాయి. మొత్తం డేటాను ఒకేసారి సేవ్ చేయడం మొదటి పద్ధతి అయితే, కేవలం మారిన ఫైళ్లను మాత్రమే సేవ్ చేయడం మిగిలిన రెండు పద్ధతుల ప్రత్యేకత. ఇవి సమయాన్ని, ఇంటర్నెట్ డేటాను ఆదా చేయడంలో తోడ్పడతాయి. సాంకేతిక నిపుణులు సూచించే అత్యంత ప్రభావవంతమైన సూత్రం "3-2-1 బ్యాకప్ రూల్". దీని ప్రకారం ప్రతి ఫైలుకు కనీసం మూడు కాపీలు ఉండాలి, వాటిని రెండు వేర్వేరు మీడియా రకాల్లో ఉంచాలి, మరియు ఒక కాపీని భౌతికంగా మన కార్యాలయం లేదా ఇంటికి దూరంగా మరో సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. ఈ విధానం అనుసరిస్తే ఎలాంటి విపత్తు సంభవించినా డేటాను తిరిగి పొందడం సులభం అవుతుంది.

వ్యాపార ప్రపంచంలో డేటా అనేది ప్రాణవాయువు వంటిది. నేటి కాలంలో డేటా లేని వ్యాపారాన్ని ఊహించలేము. చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలపై డేటా నష్టం చూపే ప్రభావం అత్యంత విధ్వంసకరంగా ఉంటుంది. ఒక సర్వే ప్రకారం, భారీ డేటా నష్టాన్ని ఎదుర్కొన్న చిన్న సంస్థలలో 60 శాతం ఆరు నెలల లోపే మూతపడు తున్నాయి. ఎందుకంటే సమాచారం లేనిదే లావాదేవీలు నిర్వహించడం, కస్టమర్ల వివరాలను తెలుసు కోవడం సాధ్యం కాదు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ మరియు ఇ-కామర్స్ రంగాలలో డేటా భద్రత అనేది చట్టపరమైన బాధ్యత కూడా. రోగుల రికార్డులు లేదా ఆర్థిక లావాదేవీల డేటా లీక్ అయినా లేదా పోయినా, ఆ సంస్థలు కోట్లాది రూపాయల జరిమానాలతో పాటు ప్రజల విశ్వాసాన్ని కూడా కోల్పోతాయి. డేటా ప్రైవసీ చట్టాలు నేడు కఠినతరం కావడంతో, డేటాను భద్రపరచడం అనేది నైతిక బాధ్యతగా మారింది. కంపెనీలు తమ బిజినెస్ కంటిన్యూటీ ప్లాన్ (BCP)లో భాగంగా బ్యాకప్ వ్యవస్థలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి.

వ్యక్తిగత స్థాయిలో మనం డేటాను కేవలం ఫైళ్లుగా చూడకూడదు, అవి మన జ్ఞాపకాలు. మన స్మార్ట్‌ఫోన్‌లలో ఉండే ఫోటోలు, వీడియోలు కేవలం చిత్రాలు మాత్రమే కాదు, అవి మన జీవితంలోని మధుర క్షణాలు. అలాగే విద్యా ధృవపత్రాలు, ఆస్తుల పత్రాలు, ఆధార్ వంటి గుర్తింపు కార్డుల స్కాన్ కాపీలు డిజిటల్ రూపంలో ఉన్నప్పుడు, మొబైల్ పోవడమో లేదా ఫోన్ పాడవ్వడమో జరిగితే ఆ నష్టాన్ని వెలకట్టలేము. ప్రతి ఏటా లక్షలాది మొబైల్ ఫోన్లు దొంగతనానికి గురవుతున్నాయి. ఒకవేళ మీరు ఆటోమేటిక్ క్లౌడ్ బ్యాకప్ ఆన్ చేసి ఉంటే, కొత్త ఫోన్ కొన్న నిమిషాల్లోనే మీ పాత సమాచారమంతా తిరిగి వస్తుంది. లేదంటే ఆ జ్ఞాపకాలు శాశ్వతంగా కనుమరు గవుతాయి. అందువల్ల, టెక్నాలజీపై అవగాహన పెంచుకుని, నిరంతరం సింక్రనైజేషన్ చేయడం ద్వారా మన వ్యక్తిగత డిజిటల్ సామ్రాజ్యాన్ని రక్షించుకోవచ్చు.

ప్రభుత్వాలు కూడా నేడు డిజిటల్ పరిపాలన వైపు అడుగులు వేస్తున్నాయి. 'డిజిటల్ ఇండియా' వంటి బృహత్తర కార్యక్రమాల వల్ల కోట్లాది మంది ప్రజల వివరాలు సర్వర్లలో నిక్షిప్తమై ఉన్నాయి. భూ రికార్డుల నుండి సంక్షేమ పథకాల లబ్ధిదారుల వరకు అంతా డేటామయమే. ఇటువంటి కీలక సమయంలో ప్రభుత్వ డేటా సెంటర్లు ప్రకృతి వైపరీత్యాల నుండి, సైబర్ దాడుల నుండి రక్షించబడటం అత్యవసరం. దీనికోసం వివిధ ప్రాంతాల్లో డేటా రికవరీ సెంటర్లు (DR Sites) ఏర్పాటు చేయబడు తున్నాయి. అంటే ఒక నగరంలో డేటా సెంటర్ దెబ్బతిన్నా, మరో నగరంలో ఉన్న బ్యాకప్ సెంటర్ ద్వారా సేవలు అంతరాయం లేకుండా కొనసాగుతాయి. ఇది దేశ భద్రతలో ఒక అంతర్భాగం.

ప్రపంచ బ్యాకప్ దినోత్సవం సందర్భంగా అనేక టెక్నాలజీ సంస్థలు ఉచిత క్లౌడ్ స్టోరేజ్ ఆఫర్లు లేదా రాయితీలను ప్రకటిస్తాయి. సైబర్ భద్రతా నిపుణులు వెబినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించి సురక్షితమైన పాస్‌వర్డ్ నిర్వహణ మరియు ఎన్‌క్రిప్షన్ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ మనల్ని ఒకసారి ఆగి ఆలోచించమని కోరుతున్నాయి. "నేను చివరిసారిగా నా డేటాను ఎప్పుడు బ్యాకప్ చేశాను?" అనే ప్రశ్నకు సమాధానం మన దగ్గర ఉండాలి. బ్యాకప్ అనేది ఒకసారి చేసే పని కాదు, అది ఒక నిరంతర అలవాటుగా మారాలి. వారం వారం లేదా నెలకోసారి షెడ్యూల్ చేసుకుని డేటాను భద్రపరుచుకోవాలి. సైబర్ ముప్పులు పెరిగిపోతున్న ఈ తరుణంలో "ముందు జాగ్రత్తే ముక్తి మార్గం" అన్నది డేటా విషయంలోనూ అక్షర సత్యం.

చివరగా, సాంకేతికత ఎంతటి మహోన్నత శిఖరాలకు చేరినా, దానిలో లోపాలు సంభవించడం సహజం. మన అప్రమత్తతే అత్యుత్తమ రక్షణ. డేటా అనేది భవిష్యత్తును నిర్మించే ఇంధనం, దానిని నిర్లక్ష్యం చేయడం అంటే మన భవిష్యత్తును చీకటిలోకి నెట్టడమే. ప్రపంచ బ్యాకప్ దినోత్సవం ఇచ్చే సందేశం స్పష్టం: "అప్రమత్తంగా ఉండండి, భద్రంగా ఉండండి". మన డిజిటల్ ఆస్తులను రక్షించు కోవడానికి కేటాయించే కొద్దిపాటి సమయం, భవిష్యత్తులో రాబోయే భారీ విపత్తుల నుండి మనల్ని కాపాడుతుంది. డేటా బ్యాకప్ తీసుకోవడం ద్వారా మనం కేవలం ఫైళ్లను మాత్రమే కాదు, మన శ్రమను, మన సమయాన్ని, మన జ్ఞాపకాలను మరియు మన ఆర్థిక స్థిరత్వాన్ని భద్రపరుచు కుంటున్నాము. ఈ డిజిటల్ యుగంలో బాధ్యతాయుతమైన పౌరుడిగా ప్రతి ఒక్కరూ ఈ అలవాటును పాటిస్తూ, ఇతరులకు కూడా అవగాహన కల్పించడం ద్వారా సురక్షితమైన డిజిటల్ సమాజాన్ని నిర్మించగలము. మీ డేటాను ఇప్పుడే బ్యాకప్ చేయండి, రేపటి భద్రతకు బాటలు వేయండి. డేటా బ్యాకప్ అనేది కేవలం సాంకేతిక అవసరం కాదు, అది ఒక బాధ్యత. ఈ ప్రపంచ బ్యాకప్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ డిజిటల్ ఆస్తుల రక్షణకు ప్రతిజ్ఞ చేద్దాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,**
**కాలమిస్ట్... 9440595494**

# వాక్పటిమ నుంచి వాగ్వాదం వరకు




**చట్ట సభల భాషా పరిణామం**
**నాడు సంస్కారం... నేడు సంచలనం:**
**సభల భాషలో మార్పుల కథనం**

చట్ట సభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిష్ఠాత్మక వేదికలు. ఇక్కడ వినిపించే ప్రతి పదం ప్రజల రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. “నాడు – నేడు” అనే కోణంలో పరిశీలిస్తే, ఒకప్పుడు గౌరవప్రదమైన, శాస్త్రీయమైన భాషకు నిలయంగా ఉన్న చట్ట సభలు, నేడు కొన్నిసార్లు రికార్డుల్లో చోటు పొందలేని అసభ్య, అవమానకర పదజాలంతో కూడా ముడి పడుతున్న దృశ్యం కనిపిస్తోంది.

స్వాతంత్ర్యానంతర కాలంలో తొలి లోక్‌సభలు, రాష్ట్ర శాసనసభలు ఒక విలక్షణ విద్యామండలి వలె ఉండేవి. సభలో మాట్లాడే ప్రతి సభ్యుడు తన వాక్చాతుర్యాన్ని, విషయ పరిజ్ఞానాన్ని, సంస్కారాన్ని ప్రతిబింబించేలా మాట్లాడేవాడు. “గౌరవ సభ్యుడు”, “మహనీయులైన స్పీకర్ గారు” వంటి సంభాషణా పద్ధతులు సభా సంప్రదాయంగా ఉండేవి. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా, అంశపరమైన చర్చలకే ప్రాధాన్యం ఉండేది. ఆ కాలంలో ఉపయోగించిన పదజాలం రికార్డుల్లో నిలిచేలా శుద్ధంగా, సాహిత్య పరిమళంతో ఉండేది.

అయితే కాలక్రమేణా రాజకీయ వ్యవస్థలో పోటీ పెరగడం, మీడియా ప్రభావం, ప్రత్యక్ష ప్రసారాల విస్తరణ వంటి కారణాలతో చట్ట సభల భాషలో మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా 1980ల తర్వాత ఈ మార్పు వేగవంతమైంది. సభలు ప్రజల దృష్టిని ఆకర్షించే వేదికలుగా మారడంతో, కొంతమంది సభ్యులు కఠిన పదజాలాన్ని ఉపయోగించడం ప్రారంభించారు.

నేటి పరిస్థితుల్లో, చట్ట సభలలో వినిపించే కొన్ని పదజాలాలు అధికారిక రికార్డుల్లో నమోదు చేయడానికి అనర్హంగా పరిగణించ బడుతున్నాయి. వీటిని “అన్‌పార్లమెంటరీ ఎక్స్‌ప్రెషన్స్”గా పిలుస్తారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల నియమావళి ప్రకారం, వ్యక్తిగత అవమానాలు, అసభ్య పదాలు, కించపరిచే వ్యాఖ్యలు—ఇవి రికార్డుల నుండి తొలగించ బడతాయి.

తెలుగు రాష్ట్రాల శాసనసభల్లో తరచుగా వినిపించి, తరువాత రికార్డుల నుండి తొలగించబడిన కొన్ని అన్‌పార్లమెంటరీ పదజాలాల ఉదాహరణలు పరిశీలిస్తే పరిస్థితి స్పష్టమవుతుంది. ఉదాహరణకు “దొంగ”, “మోసగాడు”, “అబద్ధకోరు”, “నిర్లజ్జుడు”, “అసమర్థుడు”, “దుర్మార్గుడు” వంటి పదాలు వ్యక్తిగత దూషణలకు చెందినవిగా పరిగణించబడి రికార్డుల్లో నిలవవు. అలాగే “చెత్త ప్రభుత్వం”, “అవినీతి కూపం”, “పిచ్చి నిర్ణయం”, “బుద్ధిలేని చర్య” వంటి వ్యాఖ్యలు కూడా సందర్భానుసారం తొలగించ బడతాయి. కొన్నిసార్లు “గద్దె దిగిపో”, “నీవు అర్హుడు కావు”, “నీకు సంస్కారం లేదు” వంటి వ్యాఖ్యలు కూడా సభా గౌరవానికి భంగం కలిగించేవిగా భావించ బడతాయి.

ఇంకా కొంత ఘాటైన సందర్భాల్లో, పరస్పర ఆరోపణల మధ్య వినిపించే పదజాలం మరింత తీవ్రమై, వెంటనే స్పీకర్ జోక్యం చేసుకుని ఆ పదాలను రికార్డుల నుండి తొలగించే పరిస్థితులు ఏర్పడు తున్నాయి.

ఇటువంటి సందర్భాలు గత రెండు దశాబ్దాల్లో పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2000ల ప్రారంభంలో అన్‌పార్లమెంటరీ పదాల తొలగింపులు పరిమితంగా ఉండగా, ఇటీవల కాలంలో ఇవి గణనీయంగా పెరిగాయి.

పార్లమెంట్, శాసన సభలలో సమావేశాల సంఖ్య కూడా తగ్గింది. 1950లలో సంవత్సరానికి సగటున 120 రోజులు సమావేశాలు జరిగేవి. ప్రస్తుతం అది 60–70 రోజులకు పరిమితమైంది. అదే సమయంలో, అంతరాయాలు, నినాదాలు, నిరసనలు పెరగడం వల్ల చర్చలకు లభించే సమయం తగ్గింది. 16వ లోక్‌సభలో సుమారు 40 శాతం సమయం అంతరాయాలకు గురైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

ఈ వాతావరణంలో భావోద్వేగ పూరిత, కొన్నిసార్లు అసభ్య పదజాలం వినిపించడం ఎక్కువైంది.

సోషల్ మీడియా ప్రభావం కూడా భాషపై తీవ్రంగా పడింది. తక్షణ స్పందనల సంస్కృతి కారణంగా రాజకీయ నాయకులు ఘాటైన వ్యాఖ్యలకు అలవాటు పడిపోయారు. అదే ధోరణి చట్ట సభలలోనూ కనిపిస్తోంది. ఫలితంగా, ఆలోచనాత్మక చర్చల స్థానంలో కొన్నిసార్లు వ్యక్తిగత విమర్శలు, నినాదాలు ప్రాధాన్యం పొందుతున్నాయి.

అయితే ఈ పరిణామాన్ని పూర్తిగా ప్రతికూలంగా మాత్రమే చూడలేము. నేటి చట్ట సభలలో అణగారిన వర్గాల స్వరాలు బలంగా వినిపిస్తున్నాయి. వారి భాషలో ఆవేదన, కోపం సహజమే. కానీ అది అసభ్య పదజాలంగా మారకుండా నియంత్రించాల్సిన బాధ్యత సభ్యులపైనే ఉంది.

భవిష్యత్తులో చట్ట సభల గౌరవాన్ని కాపాడటానికి భాషా నియంత్రణ అత్యవసరం. స్పీకర్‌లు, చైర్మన్‌లు కఠినంగా వ్యవహరించాలి. సభ్యులకు పార్లమెంటరీ ప్రవర్తనపై శిక్షణ ఇవ్వాలి. ప్రతి సభ్యుడు తన మాటల ప్రభావాన్ని గుర్తించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

మొత్తంగా చూస్తే, నాడు చట్ట సభల భాష ఒక ఆదర్శంగా నిలిచింది. నేడు కొన్ని సందర్భాల్లో అది రికార్డుల్లో చోటు పొందలేని స్థాయికి దిగజారింది. “దొంగ”, “మోసగాడు”, “నిర్లజ్జుడు”, “చెత్త ప్రభుత్వం”, “పిచ్చి నిర్ణయం” వంటి పదజాలాల వినియోగం పెరగడం ప్రజాస్వామ్యానికి హెచ్చరిక. ఈ ధోరణిని సరిదిద్దడం ద్వారా మాత్రమే చట్ట సభలు తమ గౌరవాన్ని, విశ్వసనీయతను తిరిగి పొందగలవు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...**
**9440595494**

# కాంట్రవర్సీ కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు చేయాలి

- **శాసనసభలో సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల వ్యవహరించిన తీరు దారుణం..**
- **ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చారు..**
- **ఇలాంటివారు అసెంబ్లీలో ఉండకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి..**
- **రౌడీయిజం గుండాయిజం చెల్లదు..**
- **కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది..**
- **డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్..**



**కరీంనగర్, మార్చి 30:** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజు హుస్సేన్ మండిపడ్డారు. సీనియర్ ఎమ్మెల్యే అయిన కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరును నిరసిస్తూ సిరాజు హుస్సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి వ్యక్తులు శాసనసభలో ఉండడం ప్రమాదకరమని వెంటనే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఒక చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను చర్చించే పవిత్ర వేదిక అయిన అసెంబ్లీలో బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన స్థానంలో ఉండి, ప్రజా ప్రతినిధిగా ప్రవర్తన సరిగా లేకపోవడం బాధాకరమన్నారు. సీనియర్ నేతగా సీనియర్ ఎమ్మెల్యేగా పలుమార్లు మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి పట్ల హవ భావాలు చేస్తూ కించపరచడం సరైనది కాదన్నారు. ఆయనకు వెంటనే బేషరతుగా కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి కాంట్రవర్సీ చేయడం కౌశిక్ రెడ్డికి అలవాటుగా మారిందని పత్రికల్లో హైలెట్ కావడం రివాజ్ గా మారిందన్నారు. గతంలో గవర్నర్గా పనిచేసిన తమిళసై పట్ల చులకనగా మాట్లాడడం ఎవరిని లెక్క చేయకపోవడం ఇటీవల సిపి గౌష్ ఆలం పై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి నాయకుడు నైతిక విలువలను పాటిస్తూ, ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కానీ ఇటువంటి ఘటనలు ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించాలనే బాధ్యతను గుర్తుంచుకోవాలని కౌశిక్ రెడ్డికి సూచించారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని రాష్ట్రమంతా వ్యతిరేకిస్తున్నారని ప్రజలంతా తగిన గుణపాఠం చెబుతారని సిరాజు హుస్సేన్ పేర్కొన్నారు.

# జాతీయ పతాకానికి 105 వసంతాలు

## 1921 మార్చి 31... వెంకయ్య జాతీయ జెండా రూపొందించిన దినం



భారత దేశంతో బాటు ప్రపంచం లోని చాలా దేశాల జాతీయ పతాకాలు మూడు రంగులవే. భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధి కారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. గాంధీజీ కోరిక మేరకు 1921 మార్చి 31న వెంకయ్య జాతీయ జెండాకు రూప కల్పన చేశారు.

స్వాతంత్ర్య సమర యోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లెలో, జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించు కొని, తన 19 వ ఏట ముంబై వెళ్లి సైన్యంలో చేరారు. మద్రాసులో ప్లేగు ఇనస్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇనస్పెక్టరుగా పనిచేసారు. అతని జ్ఞాన దాహం అంతు లేనిది. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. కొంతకాలం రైల్వేలో గార్డుగా పనిచేసాడు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి లాహోర్ లోని డి.ఎ.వి. కాలేజీలో చేరి, సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్ భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్య గారిని "జపాన్ వెంకయ్య" అని పిలిచేవారు.

1899 – 1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లు చూచి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూప కల్పన గురించి చర్చలు జరిపారి.

1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు.

1916 లో "నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్" పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావించారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు.1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగురవేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన "లాలా హన్స్ రాజ్" మన జాతీయ పతాకంపై రాట్నం చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమా వేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారంగానే, మార్చి 31న ఒక జెండాను సమ కూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు.

"మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియ వస్త్రం"గా "గాంధీజీ"చే, వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది.

1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం.

1947 ఆగస్టు 15 న బ్రిటిష్ వారి నుండి భారతదేశం స్వాతంత్ర్యం పొందటానికి కొద్ది రోజుల ముందు, 1947 జులై 22న న జరిగిన రాజ్యాంగ అసెంబ్లీ సమావేశంలో భారత జాతీయ పతాకాన్ని ఇప్పుడు ఉన్న రూపంలో స్వీకరించారు.

స్వతంత్ర భారతదేశ జాతీయపతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్.అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయపతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మచక్రాన్ని చేర్చారు. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయపతాకంగా ఉద్వేగభరిత వాతావరణంలో 1947 ఆగష్టు 15 నాడు ఆవిష్కరించారు.

పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందే మాతరం, హోమ్‌రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమం లాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసు లలో "రైల్వే గార్డు"గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలము బళ్లారిలో "ప్లేగు అధికారి"గా ప్రభుత్వ ఉద్యోగము చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగము చేయనివ్వలేదు.

1906 నుండి 1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాస ముండి, పత్తి మొక్కలలోని మేలు రకముల పరిశోధనలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో "కంబోడియా పత్తి" అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వముకూడా గుర్తించడముతో ఆయనకు "పత్తి వెంకయ్య" అని పేరు వచ్చింది.

తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేసారు.

అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది.1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు ' త్రివేణి ' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయ వాడలో డా. కె.ఎల్.రావు, డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ " నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక " అన్నారు.

ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964 లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్క రించినా, విజయవాడ గాంధీ హాల్ నందు విగ్రహా విష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచుకోవలసిన పింగళి వెంకయ్యకు... రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి, కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.



# బిఆర్ఎస్ ఆడే పోటీలను నిర్వహించలేం

## మత్తు వదిలించుకోవడానికే మైదానానికి రమ్మన్నాం

## వారు ఆడలేమంటే..వారి ఆటలు పెట్టలేం కదా

## క్రీడాపోటీల్లో పాల్గొనడం లేదన్న కెటిఆర్ వ్యాఖ్యలపై వాకిటి కౌంటర్

**హైదరాబాద్ :** తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనబోమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటున్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు. 'మావి వేరే గేమ్స్, కేటీఆర్‌వి మరో రకమైన గేమ్స్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ వాళ్లు ఆడే గేమ్స్ పెట్టడం సాధ్యం కాదు కదా? అంటూ మంత్రి వాకిటి శ్రీహరి చురకలు అంటించారు . తాము ఫిట్ తెలంగాణ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. ఆరోగ్య తెలంగాణ ఉండాలని సీఎం ఆలోచన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు డ్రగ్స్ వంటి ఆలోచనలు రాకుండా ఆటల వైపు మళ్లుతారని వాకిటి పేర్కొన్నారు. కాగా, నేటి నుంచి రెండ్రోజులపాటు జరిగే లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2026లో తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొనరంటూ ఎమ్మెల్యే కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా క్రీడా పోటీలు అవసరమా? అంటూ ప్రశ్నించారు. శాసనసభ సమయం వృథా చేయడం తగదని.. కనీసం ఇంకో 10 రోజులు సమావేశాలను కొనసాగించాలని అన్నారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.

# నాసిరకం ఉస్మానియా బిస్కట్ల తయారీ

## టాస్క్‌ఫోర్స్ టీమ్ దాడి: వ్యక్తి అరెస్ట్



**హైదరాబాద్, మార్చి 30:** హైదరాబాద్‌లో కొందరు వ్యక్తులు నాసిరకం ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. ఇప్పటికే అలాంటి ఓ పరిశ్రమను పోలీసులు సీజ్ చేశారు. తాజాగా మరో ఫ్యాక్టరీని కూడా సీజ్ చేశారు. హైదరాబాద్‌లోని కేడీ కాలనీ పరిధిలో ఎటువంటి అనుమతులూ లేకుండా, అపరిశుభ్ర వాతావరణంలో నడుస్తున్న ఉస్మానియా బిస్కెట్ల తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. భారీ మొత్తంలో నిల్వ ఉంచిన బేకరీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అహ్మద్ రజా అనే వ్యక్తి పూర్తి అపరిశుభ్ర వాతావరణంలో, నాసిరకం ముడి సరుకులతో ఉస్మానియా బిస్కెట్లను తయారు చేస్తున్నాడు. ఉత్పత్తులను నగరంలోని వివిధ కిరాణా షాప్‌లు, హోటళ్లు, బేకరీలు, కేఫ్స్‌లకు సరఫరా చేస్తున్నాడు . ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్ అతడి తయారీ కేంద్రంపై దాడి చేసింది. అక్కడ ఉన్న యంత్రాలను, ముడి పదార్థాలను, ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంది. అహ్మద్ రజాను అరెస్ట్ చేసింది.

# గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

## వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు



**భద్రాచలం, మార్చి30:** భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహ వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# మంటలు చెలరేగి కారు దగ్ధం

**యాదాద్రి భువనగిరి,మార్చి 30:** బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగా దగ్ధమైంది.



# భక్తికి సోపానాలు సాంస్కృతిక కళలు

**మందమర్రి:** భక్తి భావాన్ని పెంపొందించడంలో సాంస్కృతిక కళలు కీలకపాత్ర పోషిస్తాయని తెలంగాణ సాంస్కృతిక యువజన శాఖ సలహా మండలి సభ్యుడు అంతడుపుల నాగరాజు అన్నారు. శ్రీరామ నవమి మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మందమర్రి పట్టణంలోని యాపల్లో ఉన్న కోదండ రామాలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సంగార్తి సంతోష్‌తో కలిసి నటరాజ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి క్రేజీ స్టార్ డాన్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ సారథ్యం వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోల్ బెల్ట్ ప్రాంతంలో కళలకు కొదవలేదని, ఇక్కడి ప్రజలు ఎప్పుడూ కళలను ఆదరిస్తారని తెలిపారు. కాగా ప్రముఖ గాయకుడు జంగిలి బాలకృష్ణ వినాయక శ్లోకాలతో నృత్య ప్రదర్శనలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప్పులేటి రాజమౌళి, కాంగ్రెస్ నాయకుడు రాయబారపు కిరణ్, ప్రముఖ రచయిత విత్తనాల శ్రీనివాస్, బైరం రాము, శ్రీ కోదండ రామాలయ కమిటీ అధ్యక్షుడు బొద్దిరెడ్డి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొద్దున ఓం ప్రకాష్, కోశాధికారి అడ్డూరి సాంబమూర్తి, వర్ష సంపత్, రాసపాక అశోక్, కొమ్ముశెట్టి తిరుపతి, పైడిపల్లి కుమార్, ఓదెలు, నూనె రవి, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.








# నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి

**మందమర్రి:** నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి సాధ్యమని ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్, సీసీఎల్ ఎస్సీఆర్ మందమర్రి ఏరియా ఆధ్వర్యంలో కాస్మోటాలజీ కోర్సులు పూర్తి చేసిన 31 మందికి శనివారం మందమర్రి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి సూచనల మేరకు స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సింగరేణి కాలరీస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి రాధాకృష్ణ, ఏటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్రల సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, జీఎంబీటీసీ అదనపు మేనేజర్ పి.శ్రీధర్, అశోక్ కుమార్, జీఎంబీటీసీ అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్, కాస్మోటాలజీ ట్రైనర్ ప్రీతి, ఎంపీటీసీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# 6న పిప్పిరిలో సీఎం బహిరంగ సభ



- ఏర్పాట్లు పూర్తి చేయాలి
- డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క

**ఆదిలాబాద్:** పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 99 రోజుల ప్రజాపాలన ఉత్సవాల్లో ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లపై ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర ఉన్నత అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలు చేసే పత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీహొ చేయడం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న 99 రోజుల 'ప్రజాపాలన' ఉత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బలమైన పునాది వేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర ఉన్నత అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామంలో ఏప్రిల్ 6న నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మూడేళ్ల క్రితం తాను చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర పిప్పిరి గ్రామం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. అందుకే ఈ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా, పాదయాత్ర సమయంలో కొన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పత్రాలను అందజేస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి బాసరకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, అనంతరం అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 2 గంటలకు పిప్పిరి గ్రామానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్రంలో 99 రోజుల ప్రజాపాలన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని అన్నారు.. ఇందులో భాగంగానే గ్రామసభల నిర్వహణతో పాటు, ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభను పిప్పిరిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించించినట్లు పేర్కొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ ద్వారా ప్రొహిబిషన్ జాబితాలో చేర్చిందని, దీంతో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర సందర్భంగా తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాటి సీఎల్పీ నేతగా తాను కలిసి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను వేధిస్తున్న ధరణిని రద్దు చేసి, పారదర్శకమైన వ్యవస్థను తెస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ మాట ప్రకారమే అధికారంలోకి రాగానే 'భూభారతి' చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం అసైన్డ్ భూములను 'పార్ట్–బి'లో పెట్టి రైతులకు హక్కులు లేకుండా చేసిందని, కానీ తమ ప్రభుత్వం చట్టబద్ధంగా వారి హక్కులను కాపాడుతుందని స్పష్టం చేస్తూ ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. 2004లో జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా అడ వద్ద కొమరంభీమ్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనప్పటికీ, గత పది ఏళ్లుగా కాలువల నిర్మాణం పూర్తికాకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారనిహొఅన్నారు. కుడి, ఎడమ కాలువలను వెంటనే పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే చిక్‌మన్, పులిమడుగు, కుప్టి త్రివేణి సంగమం ప్రాజెక్టులకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. గిరిజనుల అభ్యున్నతి కోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా సాగును ప్రోత్సహించాలని సూచించారు. గిరిజన మహిళలు స్వయం ఉపాధిలో రాణించేలా వారికి వడ్డీ లేని రుణాలు అందిస్తూ తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. గతంలో పాదయాత్ర సందర్భంగా కేస్లాపూర్ లోని నాగోబా దేవాలయాన్ని సందర్శించినప్పుడు మెస్రం వంశీయులు తమ సమస్యలను వివరించి ఆలయ అభివృద్ధిని కోరిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలయ అభివృద్ధి కోసం నిధులు కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అదేవిధంగా, ఈ ఏడాది జూన్ 2 నుంచి ప్రారంభించబోయే నూతన పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అయితే పాదయాత్రలో చాలా మంది పేదలు ఇళ్ల కోసం విన్నవించుకున్నారని గుర్తు చేశారు. ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినా వాటిని స్వీకరించాలని, అర్హులందరికీ ఇళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రజాపాలన 99 రోజుల ఉత్సవాలతోహొ పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆనాటి సీఎల్పీ నేత ప్రస్తుత, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిప్పిరి గ్రామం నుంచి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.హొముఖ్యమంత్రి హాజరవుతున్న బహిరంగ సభకు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చట్టబద్ధంగా ఉన్న వాటిని పరిష్కరించాలని, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా వారికి మంజూరు పత్రాలను అందించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, వెడమ బొజ్జు, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఎడ్యుకేషన్ సెక్రెటరీ యోగితారాణా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆసిఫాబాద్ కొమరం భీం జిల్లా కలెక్టర్ హరిత, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిప్యూటీ సీఎం సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





## పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



**ఎల్లారెడ్డిపేట:** పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాబేరా బేగం గౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు కలగడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో ఈ పథకం కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మెండే సిను, టౌన్ ప్రెసిడెంట్ చెనీ బాబు, బుచ గౌడ్, బండారి బాల్ రెడ్డి, ఇమామ్, సంతోష్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల గడువు పొడిగింపు



**మంచిర్యాల:** 2025–26 సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆమోదించిన మొదటి విడత పథకాల కోసం అర్హత గల ఎస్సీ యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఏప్రిల్ 2 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈఈ చాతరాజుల దుర్గాప్రసాద్ తెలిపారు. రవాణా రంగంలో ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన ఈవి ద్విచక్ర వాహనాల కోసం లక్ష్యం 185 యూనిట్లు ఉండగా 608 దరఖాస్తులు, ఈవి త్రిచక్ర వాహనాల కోసం లక్ష్యం 91 యూనిట్లు ఉండగా 838 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ పథకాల్లో సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగాలకు లక్ష్యం 19 యూనిట్లు ఉండగా, 73 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చినట్లు తెలిపారు. అర్హత గల ఎస్సీ యువత https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజా భవన్‌లో అన్నదానం



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, సీనియర్ నాయకురాలు అఫ్రోజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు కంది శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ద్వారా పేదలకు ఆహారం అందించడం గొప్ప సేవగా అభివర్ణించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

## 30న బిల్డింగ్ వర్కర్స్ 'చలో హైదరాబాద్'

**తుపల్లి:** బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' లేబర్ కమిషనరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో కాలేషా ఆధ్వర్యంలో జరిగిన అసంఘటిత రంగ కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టాన్ని బలహీనపరుస్తూ ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించడం దుర్మార్గమని విమర్శించారు. సిఎస్‌సి హెల్త్ టెస్టుల పేరుతో కోట్ల రూపాయల దోపిడి జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లకు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. అంగన్వాడి, ఆశ తదితర రంగాల కార్మికుల పోరాటాలను అణచివేస్తూ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, మహిళలను సైతం అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

# మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**మంచిర్యాల:** మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి, 2025–26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026–27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ లను కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ప్రతిపాదిత మున్సిపల్ బడ్జెట్‌ను ఖరారు చేశారు. 2026–27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ రూ.25కోట్ల 80 లక్షల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో రూ.3కోట్ల 42లక్షలు సాధారణ ఆదాయం, రూ.21కోట్ల 42లక్షల గ్రాంట్లు, రూ.90లక్షల డిపాజిట్లు, అడ్వాన్సులు, రూ.5లక్షల 95వేల నిలువ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని డంప్ యార్డ్‌లో చేపడుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించారు. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతులలో వేరు చేసి, పర్యావరణానికి హాని లేకుండా నిర్వహిస్తున్న విధానం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో మైనింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత కుటుంబాన్ని పరామర్శించిన ఆడే గజేందర్



**సిరికొండ:** సిరికొండ మండలం సుంకుడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తోడసం భూపతి తండ్రి ఇటీవల మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చి ఓదార్చారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, సలహాదారు సద్దాం, మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, మౌలానా తదితరులు ఉన్నారు.



## వేసవిలో నీటి కొరత లేకుండా చర్యలు

**ఉద్యమ కెరటం: భీంపూర్:** మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హ్యాండ్ బోర్ ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ దాసరి రమేశ్ తెలిపారు. వేసవి కాలంలో నీటి కొరత తీవ్రంగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో అనేక బోరుబావులు ఎండిపోవడంతో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. దీంతో ప్రజలకు నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న నీటి కొరతను బట్టి పైప్‌లైన్‌ల ఏర్పాటుకు గ్రామ సర్పంచ్‌లకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. ఇచ్చోడ మండలంలోని బోరీగామ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడంలో, నేరస్తులను పట్టుకోవడంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలు సామాజిక బాధ్యతగా తమ ప్రాంతాల్లో ఇలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



**ఉద్యమ కెరటం, భద్రాద్రి కొత్తగూడెం:** జర్నలిస్టులకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఇండ్ల స్థలాలు, వివిధ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. జీరో అవర్ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వారికి సబ్సిడీతో కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు అందించాలని పేర్కొన్నారు. అలాగే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, జీవిత బీమా సదుపాయం కల్పించడంతో పాటు రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. చిన్న పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు (యాడ్స్) ఇవ్వడానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వివరించారు.

## రేచిని వారసంత వేలం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని రేచిని గ్రామంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారసంతకు సంబంధించిన వేలం పాట శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం రేచిని గ్రామ సర్పంచ్ పోతరాజుల రాంబాయి, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్ సమక్షంలో జరిగింది. వేలం పాటలో పది మంది వ్యక్తులు రూ.5వేల చొప్పున డిపాజిట్ చేసి పోటీలో పాల్గొన్నారు. ఈ వేలంలో రేచిని గ్రామానికి చెందిన ఎర్ర అశోక్ అత్యధికంగా రూ.38వేలు వేలం పాట పాడి వారసంత హక్కులను దక్కించుకున్నాడు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారదర్శకంగా ఈ వేలం పాట నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండీ అహ్మద్**




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** పట్టణ ప్రజలు తమ ఇంటి పన్ను, నీటి పన్ను మరియు ట్రేడ్ లైసెన్స్ ఫీజులను సకాలంలో చెల్లించి ఆసిఫాబాద్ పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్ కోరారు. శనివారం ఆసిఫాబాద్ పురపాలక సంఘం పరిధిలోని 16వ వార్డులో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో ఆయన వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, కమిషనర్ గజానంద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని, ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్తను మహిళలు తడి, పొడి మరియు హానికర వ్యర్థాలుగా వేరు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్దే హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ దోమల నివారణకు వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి మందు స్ప్రే చేయిస్తున్నామని, ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ గజానంద్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో ప్రస్తుతం పన్నుల వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించి మున్సిపల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 16 వ వార్డు కౌన్సిలర్ దూడల లక్ష్మి, బీఆర్ఎస్ నాయకుడు దూడల అశోక్, మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి పటిష్ట చర్యలు

**జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇంచార్జి అదనపు కలెక్టర్ ఏం. డెవిడ్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పాఠకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డెవిడ్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీరాజ్, విద్యాశాఖ, గ్రంథాలయ శాఖ, మున్సిపల్ శాఖ, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రంథాలయాల్లో త్రాగునీరు, పాఠకులకు కుర్చీలు, టేబుళ్లు, టాయిలెట్, ఫ్యాన్ లు, వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా చల్లని త్రాగు నీరు, ఓ. ఆర్. ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉంచాలన్నారు. ఆలయాల్లో చరిత్రకు సంబంధించిన గ్రంథాలయ సర్వస్వము ఈ విజ్ఞాన సూచిక, ఎంప్లాయిమెంట్ న్యూస్ కురుక్షేత్ర, యోజన, కస్టమర్ అవాజ్ పునాది, వంటి తెలుగు, ఇంగ్లీష్ మ్యాగ్ జైన్లు ఉండాలన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సరిపడా మెటీరియల్స్ ను అందుబాటులో ఉంచాలని అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీలు, మునిసిపల్ శాఖలు, గ్రంథాలయ సెస్సులను చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరము వార్షిక పద్దును ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఏ. సరిత, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, లైబ్రరీయన్ లు సదానందం, ప్రవీన విద్యా శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో పాత పేరే కొనసాగించాలి

**• డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టికానంద్**



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం దంతన్ పల్లి గ్రామంలో సాగుతున్న ఉపాధి హామీ పనులను డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికానంద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలపై ఆయన మాట్లాడుతూ, పథకం పేరును 'వి బి జి రాం జీ' గా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ, 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' పేరునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి జాబ్ కార్డుకు పని దినాలను 200 రోజులకు పెంచి, కేరళ తరహాలో రోజుకు 800 వేతనం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిధుల వాటాను 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు రవాణా సౌకర్యం, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా కల్పించాలని, కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం త్వరలో నిర్వహించబోయే 'కలెక్టరేట్ ధర్నా'ను అందరూ కలిసి విజయవంతం చేయాలని టికానంద్ పిలుపునిచ్చారు.

# విద్యార్థులు జర్నలిజం వైపు అడుగులు వేయాలి



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** విద్యార్థులు జర్నలిజం వైపు అడుగులు వేయాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ కంబాల మురళీకృష్ణ అన్నారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో "జర్నలిజం - మౌళికాంశాలు" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జర్నలిజం రంగంలోని ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్తలను ఎలా రాయాలి, వార్త నిర్మాణం ఎలా ఉండాలనే అంశాల గురించి వివరించారు. ప్రస్తుత కాలంలో జర్నలిజం కోర్సును ఒక మంచి కెరీర్ అవకాశంగా విద్యార్థులు ఎంచుకోవచ్చని సూచించారు. అనంతరం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల ద్వారా విద్యార్థులకు ఆయా అంశాలపై మరింత అవగాహన కలుగుతుందని తెలిపారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ లక్ష్మినరసింహం మాట్లాడుతూ డిగ్రీ పూర్తయ్యాక జర్నలిజం కోర్సులు అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్థన్, లెక్చరర్లు జె.మహేశ్, శాంభవి, సానియా తదితరులు పాల్గొన్నారు.

# అధికారికంగా మంథని ప్రముఖుల జయంతి, వర్ధంతి

- కౌన్సిల్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్
- రావికంటి రామయ్య గుప్తకు ఘన నివాళి



**మంథని, మార్చి 30:** వివిధ రంగాల్లో ప్రతిభ చూపి మంథనికి గర్వకారణమైన ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను మున్సిపల్ కార్పొరేషన్ తరపున అధికారికంగా నిర్వహించే విషయంలో కౌన్సిల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ప్రజాకవి, మంత్రకూట వేమన రావికంటి రామయ్య గుప్తా 17వ వర్ధంతి సందర్భంగా సోమవారం వారి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంథని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను చక్కగా చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపై ఉంటుందన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారి వేతనంలో 15% కోత విధించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దివంగత ప్రజానేత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని వారి తనయుడు, మంత్రి శ్రీధర్ బాబు ఏటా ఘనంగా చేస్తూ వారి స్ఫూర్తిని చాటుతున్నారని కొనియాడారు. అదే బాటలో రావికంటి రామయ్య గుప్త తనయులు వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏటా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. రావికంటి రామయ్య గుప్త ఉపాధ్యాయునిగా కవిగా, సమాజానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మంథని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్ మాట్లాడుతూ మంథనిలో కొలువుదీరిన వైశ్య ప్రముఖులు రావికంటి రామయ్య గుప్తా, గుండా నాగరాజుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు శశి భూషణ్ కాచె, బీజేపీ నాయకుడు బోగోజు శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయుడు పవిత్రం భూమయ్య, మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండెల మారుతి, రావికంటి రామయ్య గుప్త తనయుడు, జర్నలిస్ట్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కొమురవెల్లి సమ్మయ్య, ఇల్లెందుల కిషోర్, రావికంటి సదానందం, సతీష్, రేపాల రమేష్, కొంతం రమేష్, రాచర్ల నాగరాజు, దొంతుల రాజేందర్, గుండా హరీష్, శైలజ, చంద్రకాంత్, ఇల్లెందుల సత్యనారాయణ, రాజమౌళి గౌడ్ తదితరులు పాల్గొని రావికంటి రామయ్య గుప్తకు ఘనంగా నివాళులు అర్పించారు.

# పెండింగ్లో ఉన్న రెవిన్యూ క్లబ్, టీఎన్జీవో, ఎక్సైజ్ కాంప్లెక్స్ ప్రాపర్టీ ట్యాక్స్ లు వాసులు చేయండి

- లక్షల్లో కిరాయిలు వస్తున్న కోట్ల రూ ||లు ట్యాక్స్ లను ఎగ్గొడుతున్నారు.
- ప్రాపర్టీ ట్యాక్స్ కట్టకుంటే సామాన్యులకు నల్ల కనెక్షన్,. కరెంట్ తొలగిస్తారు, ప్రభుత్వ అధికారుల సంఘాల భవనాలకు ఏమి చర్యలు తీసుకోరా..?
- రెవిన్యూ క్లబ్, టీఎన్జీవో, ఎక్సైజ్ కాంప్లెక్స్ ల ప్రాపర్టీ ట్యాక్స్ లకు రాయితీలు ఇవ్వద్దు.
- AIFB జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్..




**కరీంనగర్, మార్చి 30:** సోమవారం ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కి పెండింగ్లో ఉన్న కరీంనగర్ రెవెన్యూ క్లబ్ కాంప్లెక్స్ కోటి రూపాయలు, టీఎన్జీవో భవన్ కాంప్లెక్స్ 90 లక్షలు మరియు ఎక్సైజ్ కాంప్లెక్స్ లక్షల రూపాయలకు పైగా ఉన్న పెండింగ్ ప్రాపర్టీ ట్యాక్స్ లను తక్షణమే వసూలు చేయాలనీ, ప్రాపర్టీ ట్యాక్స్ రాయితీ ఇచ్చే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరామించికోవాలని పిర్యాదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించడంలో కరీంనగర్ రెవెన్యూ క్లబ్, కాంప్లెక్స్, టీఎన్జీవో కాంప్లెక్స్, ఎక్సైజ్ కాంప్లెక్స్ నిర్వహకులు నిర్లక్ష్యంగా వ్యాహరిస్తున్నారు విమర్శించారు. ప్రతి నెల లక్షల్లో కిరాయిలు వస్తున్న ప్రాపర్టీ ట్యాక్స్ ఎగ్గొట్టడానికి పెద్ద ఎత్తున పైరవీలు చేసుకువడం సిగ్గు చేటని విమర్శించారు. రెవెన్యూ క్లబ్ కాంప్లెక్స్ 35 షటర్లు, రెవిన్యూ గార్డెన్ , రెవెన్యూ రిక్రియేషన్ క్లబ్ అద్దెల రూపంలో వచ్చే ఆదాయాన్ని అసోసియేషన్ లీడర్స్ పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడడం, ఆ నిధులను దుర్వినియోగం చేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ కు కట్టాల్సిన ప్రాపర్టీ టాక్స్ దాదాపుగా గత 30 సంవత్సరాలుగా ఎగ్గొట్టడం జరుగుతుందని అన్నారు. రెవిన్యూ క్లబ్ కాంప్లెక్స్ , ఎక్సైజ్ నిర్వహకులు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కమర్షియల్ షటర్స్ కిరాయిలకు ఇచ్చి వారి వద్ద నెల నెలా అద్దెను 15 వేల నుండి 20వేల వరకు వసూలు చేస్తున్న రెవిన్యూ, ఎక్సైజ్ అసోసియేషన్, లీడర్లు రాష్ట్ర ప్రభుత్వానికి పన్ను కట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఎక్సైజ్ కాంప్లెక్ లు మరియు రెవిన్యూ క్లబ్ షెటర్స్ అధికారులకు, వారి బినామీలకె ఒక్కరికి రెండు షెటర్స్ లు ఇవ్వడం జరుగుతుందని విమర్శించారు. మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ లీడర్లు కుమ్మక్కై ఇప్పటి వరకు రెవెన్యూ కాంప్లెక్స్ కోటి రూపాయలకు పైగా, టీఎన్జవో కాంప్లెక్స్ 90 లక్షలు, ఎక్సైజ్ కాంప్లెక్స్ లక్షల రూపాయలు బకాయిలు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం ఏమి మతలబు ఉన్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి రెవెన్యూ క్లబ్, కాంప్లెక్స్, టీఎన్జీవో కాంప్లెక్స్, ఎక్సైజ్ కాంప్లెక్స్ అధికారులు, లీడర్లు పైరవీలు చేసి రాష్ట్ర ప్రభుత్వం నుండి రాయితీలు పొందడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో జిల్లా కలెక్టర్ ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఒక లేఖ ఇవ్వాలని , ముక్కుపిండి ప్రాపర్టీ ట్యాక్స్ వాసులు చేయాలనీ కోరారు.. సామాన్యుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ కరెంట్, నల్లా కనెక్షన్ కట్ చేస్తున్న నగరపాలక సంస్థ అధికారులు రెవెన్యూ కాంప్లెక్స్, టీఎన్జీవో కాంప్లెక్స్, ఎక్సైజ్ కాంప్లెక్స్ విషయంలో మాత్రం చూసీచూనడట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారో తమరే గుర్తించగలరు. ఎట్టి పరిస్థితుల్లో రెవెన్యూ కాంప్లెక్స్, టీఎన్జీవో కాంప్లెక్స్, ఎక్సైజ్ కాంప్లెక్కు రాయితీలు ఇవ్వకూడదని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రాపర్టీ టాక్స్ చెల్లించకుండా ఎగొగ్గడుతున్న సంస్థలపై, ఆ సంస్థల అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె. బద్రినేత, పార్టీ నాయకులు లచ్చయ్య ఉన్నారు.

# ఎమ్మెల్సీగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తో కలిసి 500 కోట్ల రూపాయలు సంపాదించుకున్న జీవన్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదు
- రాజకీయంగా నా ఎదుగుదలకు అడ్డుపడిన వ్యక్తి జీవన్ రెడ్డి
- సుద్దాల దేవయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకువచ్చింది జీవన్ రెడ్డి కాదా..?
- ఉద్దేశపూర్వకంగానే ఒక మీడియా ఛానల్ ద్వారా నాపై దుష్ప్రచారం
- టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం




**రీంనగర్, మార్చి 30:** టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జలకాంతం సోమవారం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, గడ్డం నాగరాజుతో పాటు పలువురు నాయకులతో కలిసి పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని 40 సంవత్సరంల నుండి కడుపులో పెట్టుకొని చూసుకుంటే కాంగ్రెస్ పార్టీ కి ఆయన చేసింది శూన్యం. జగిత్యాలలో పార్టీ శ్రేణులకు కోసం నీవు ఏమి చేశావో చెప్పు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో నీవు ఎంత మందిని గెలిపించావు చెప్పు.

నీ సొంత పనులు చేసు కున్నావు నీ కుటుంబ సభ్యులకు పని చేసినావు. జగిత్యాల ప్రజలకు నువ్వు చేసింది సున్నా కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎదిగిన నీవు బిసి, ఎస్.సి, మైనారిటీలకు అగ్ర కులాల పేద బిడ్డలకు ఏమి న్యాయం చేసినావు.. మా సీఎం రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేస్తున్నావు

**నీకు ఇది న్యాయమా..**

కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎదిగిన నీవు కాంగ్రెస్ పార్టీ పై విమర్శలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం నీవు ఏం త్యాగం చేశావో చెప్పాలి. ఎమ్మెల్సీగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తో చేతులు కలిపి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి 500 కోట్ల రూపాయలు సంపాదించుకున్నావు. ఖబడ్దార్ జీవన్ రెడ్డి ఇంకో సారి సీఎం రేవంత్ రెడ్డి గారిని విమర్శిస్తే ఊరుకునేలేదని హెచ్చరించారు.

## మిత్రుల సహకారంతో 21000/-ఆర్థిక సహాయం అందించిన బోయిన్ పేట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి..

**శ్రీలతక్రాంతి ని అభినందించిన బోయిన్ పేట్ ప్రజలు..**



**మంథని, మార్చి 30:** ఇటీవల మంథని మున్సిపల్ బోయిన్ పేట్ కి చెందిన మూగ ఆకాష్ ప్రమాదానికి గురి అయి కరీంనగర్ లోని ప్రయివేట్ ఆసుపత్రి లో చికిత్స పొంది ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వచ్చిన ఆకాష్ ను బోయిన్ పేట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి పరామర్శించి వారి కుటుంబానికి తన మిత్రుల సహాయ సహకారంతో జమ చేసిన 21000/–వేల రూపాయలను అందించి వారికి అండగా నిలిచారు. నిస్వార్థంగా సహాయం అందించిన apex హాస్పిటల్ డాక్టర్ భరత్ రెడ్డి గారికి బోయిన్ పేట్ యువతకు తన మిత్రులకు ధన్యవాదములు తెలిపిన క్రాంతి.. గతంలో కూడ బోయిన్ పేట్ లో ఎవరు ఆపదలో ఉన్న వారికీ అండగా నిలుస్తూ ప్రతి కుటుంబానికి తనకు తోచిన సహాయం అందిస్తున్న పోతరవేని శ్రీలతక్రాంతి ని బోయిన్ పేట్ వాసులు అభినందించారు..

# భక్తుల సౌకర్యార్థం సింటెక్స్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు

**మారుపాక పావని నటరాజ్ ల ఉదారత**





**మంథని, మార్చి 30:** మంథని పట్టణంలోని మహాలక్ష్మి దేవాలయం అలాగే పోచమ్మ తల్లి దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సింటెక్స్ వాటర్ ట్యాంక్ను మారుపాక పావని నటరాజ్ దంపతులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబుల సూచన మేరకు ఈ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసినట్లు పావని నటరాజులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంథని మున్సిపల్ 9వ వార్డు పరిధిలోని భక్తులతో రద్దీగా ఉండే ఈ దేవాలయాలకు వచ్చే భక్తులకు తాగునీటి అందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సిద్ధార్థ పాఠశాలల అంతర్గత చదరంగం పోటీలకు విశేష స్పందన




**కరీంనగర్, మార్చి 30:** నగరంలోని భగత్ నగర్ సిద్ధార్థ పాఠశాలలో సిద్ధార్థ పాఠశాలల అంతర్గత చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. ఆదివారం జరిగిన పోటీలో 80 మంది విద్యార్థులు పాల్గొని వారి మేధాశక్తిని చాటారు. ఈ సందర్భంగా సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ చదరంగం ఆటతో విద్యార్థులకు మేధాశక్తి ఏకాగ్రత పెరుగుతుందని అందుకు చదరంగం క్రీడ నేర్చుకునేటట్టు పిల్లలను చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. చదరంగం ఆటలో ఎంతోమంది కరీంనగర్ కు చెందిన విద్యార్థులు నేషనల్ మరియు ఇంటర్నేషనల్ క్రీడాకారులుగా ఉన్నారని అందుకు ప్రోత్సహిస్తున్న జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య అకాడమీ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ ను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ కరీంనగర్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు తాటి పెల్లి సతీష్ బాబు, కంకటి సుజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ మార్క అనిల్, కోచ్ లు తరుణ్, అభిరామ్, రేవిక్, పృధ్వి, విశాల్, బి .జీవన్ , ఆర్ ,నరేన్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

# శ్రీ బిక్షేశ్వర ఆలయ పూజారి మృతి



**మంథని, మార్చి 30:** మంథని పట్టణంలో ప్రసిద్ధ శ్రీ బిగ్షేశ్వర స్వామి దేవాలయం పూజారి పల్లి సంజీవ్ మృతి చెందారు. గత నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో హైదరాబాదులోని హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. గత మూడు దశాబ్దాలుగా పూజారి ఆలయంలో అందరితో కలుపుగోలుగా వ్యవహరిస్తూ స్వామివారి సేవలో నిమగ్నమయ్యారు. పల్లి సంజీవ్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సంజీవ్ తండ్రి ప్రభాకర్ ఇంజనీర్ గా విధులు నిర్వహించారు. రిటైర్డ్ అయిన అనంతరం ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమయ్యారు. తండ్రి లాగానే సంజీవ్ అలాగే సోదరుడు పల్లి రాము, మంథని లోని ప్రముఖ శ్రీ మహాగణపతి దేవాలయంలో అర్చకులుగా సేవలందిస్తున్నారు.



# గర్ల్ ఫ్రెండ్‌కు భారీ గిఫ్ట్

## మహికా శర్మకు 1.7 కోట్ల లగ్జరీ కారు గిఫ్ట్ ఇచ్చిన హార్దిక్ పాండ్యా!

**ముంబై:** టీమ్ ఇండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా మరోసారి వార్తల్లో నిలిచారు. తన విలాసవంతమైన జీవనశైలితో ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షించే పాండ్యా, తాజాగా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు అత్యంత ఖరీదైన కానుకను అందజేశారు. సుమారు రూ. 1.7 కోట్ల విలువైన మెర్సిడెస్ బెంజ్ వీ-క్లాస్ లగ్జరీ కారును ఆమెకు బహుమతిగా ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు. ఇటీవలే రూ. 12 కోట్ల విలువైన అల్ట్రా లగ్జరీ ఫెరారీ కారును సొంతం చేసుకున్న పాండ్యా, తక్కువ వ్యవధిలోనే ఈ ఖరీదైన గిఫ్ట్ ఇవ్వడం విశేషం. కొత్త కారుతో పాండ్యా-మహి కా దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలను చూసిన అభిమానులు రకరకాలుగా స్పందిస్తున్నారు. మరోవైపు, ఐపీఎల్‌లోనూ హార్దిక్ జోరు కొనసాగిస్తున్నారు. ఆదివారం వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో హార్దిక్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ జట్టు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అటు మైదానంలో విజయాలు, ఇటు వ్యక్తిగత జీవితంలో లగ్జరీ గిఫ్ట్‌లతో హార్దిక్ పాండ్యా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తున్నారు.

# సబలెంకా సన్‌షైన్ డబుల్

## మియామి ఓపెన్ టైటిల్ కైవసం

**మియామి (యూఎస్ఏ) :** టాప్ సీడ్ అరీనా సబలెంకా ఖాతాలో మరో ఘనత. ఇటీవలే ఇండియన్ వెల్స్ గెలిచిన ఈ బెలారస్ బామ.. తాజాగా ఆదివారం ముగిసిన మియామి ఓపెన్‌లోనూ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుని 'సన్‌షైన్ డబుల్' సాధించింది. ఫైనల్‌లో సబలెంకా.. 6-2, 4-6, 6-3తో నాలుగో సీడ్ కోకో గాఫ్ (యూఎస్ఏ)ను చిత్తుచేసింది. టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్ తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నీల (ఇండియానా వెల్స్, మియామి ఓపెన్)ను ఒకే సీజన్‌లో గెలిచిన ప్లేయర్లకు సన్‌షైన్ డబుల్ గెలిచిన ఆటగాళ్ళుగా గుర్తింపు దక్కుతుంది. 2022లో పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్ (మొత్తంగా ఐదో) క్రీడాకారిణీగా రికార్డులకెక్కింది.



# సీఎస్‌కేకు షాక్!

## బర్సపారలో రాయల్స్ హవా..

### వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ..

### 8 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం.





### టాస్ నిర్ణయం సరైంది

ఈ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నారు. బర్సపార పిచ్ సాధారణంగా భారీ స్కోర్లకు అనుకూలిస్తుంది. కానీ ఇక్కడ రాయల్స్ బౌలర్లు మొదటి ఓవర్ నుండే ఒత్తిడిని పెంచి సీఎస్ కే బ్యాటర్లను నియంత్రించడంలో విజయం సాధించారు. జోఫ్రా ఆర్చర్, నంద్రే బర్గర్, అన్షుల్ కాంబోజ్‌తో కూడిన పేస్ దళం, రవీంద్ర జడేజా, జూరెల్ ల స్పిన్ దాడి సీఎస్‌కేకు పెద్ద సమస్యగా మారింది. ఈ పిచ్ పై స్కోర్ తక్కువగా ఉన్నప్పటికీ బౌలర్లకు కొంతవరకు సహకారం లభించినట్లుంది.



**గౌహతి:** లోని బర్సపార స్టేడియంలో మార్చి 30న జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ (కేవలం 17 బంతుల్లో 52 పరుగులు) ఈ మ్యాచ్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విజయం రాయల్స్ కు పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపరచుకోవడంలో సహాయపడగా.. సీఎస్ కేకు ఈ ఓటమి ఒక పెద్ద హెచ్చరికగా మారింది.

### సీఎస్ కే బ్యాటింగ్ వైఫల్యం.. జేమీ ఓవర్టన్ ఒంటరి పోరాటం

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోరు సాధించడంలో విఫలమైంది. మొదటి ఓవర్ నుండే రాయల్స్ బౌలర్లు తమ దూకుడును ప్రదర్శించి



సీఎస్ కే వికెట్లను వెంటవెంటనే పడగొట్టారు. జేమీ ఓవర్టన్ ఒక చివరన పోరాడి 43 (36 బంతుల్లో) పరుగులు చేసి సీఎస్ కేకు కొంత గౌరవప్రదమైన స్కోరు అందించారు. కానీ ఇతర బ్యాటర్ల నుండి ఆయనకు సరైన మద్దతు లభించలేదు. కార్తీక్ శర్మ (18), సర్ఫరాజ్ ఖాన్ (17) కొంతవరకు ప్రయత్నించారు. రవీంద్ర జడేజా రాయల్స్ తరపున ఆడటం ఈ మ్యాచ్ లో అత్యంత ఆసక్తికరమైన అంశం. జడేజా రాయల్స్ తరపున బౌలింగ్ చేసి కీలకమైన 2 వికెట్లు (2/18, 3 ఓవర్లలో) పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్ (2/19), నంద్రే బర్గర్ (2/26), అన్షుల్ కాంబోజ్ (2/27) కూడా రెండు వికెట్లు చొప్పున పడగొట్టి సీఎస్ కేకు భారీ షాక్ ఇచ్చారు. ఫలితంగా సీఎస్ కే 19.4 ఓవర్లలో కేవలం 127 పరుగులకే ఆలౌట్ అయింది.

### రాయల్స్ విధ్వంసం.. వైభవ్ సూర్యవంశీ తుఫాను ఇన్నింగ్స్

128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించడానికి రాజస్థాన్ రాయల్స్ బరిలోకి దిగింది. వారు లక్ష్య ఛేదనను ఒక సాధారణ వ్యవహారంగా మార్చేశారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మొదటి బంతి నుండి సీఎస్ కే బౌలర్లకు చుక్కలు చూపించారు. కేవలం 17 బంతుల్లోనే 52 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడారు. ఈ యువ ఆటగాడి దూకుడు, షాట్ ఎంపిక చాలా అద్భుతంగా ఉన్నాయి. అతని పేలుడు ఆరంభం రాయల్స్ కు విజయానికి మంచి పునాది వేసింది. సూర్యవంశీ అవుట్ అయిన తర్వాత యశస్వి జైస్వాల్ సంయమనంతో బ్యాటింగ్ చేశారు. ఆయన 38 (36 బంతుల్లో) పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. ధ్రువ్ జురెల్ కూడా 18 (9 బంతుల్లో) పరుగులు చేశారు. ధ్రువ్ జురెల్ అవుట్ అయ్యాక జైస్వాల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్ ను సురక్షితంగా ముగించారు. రాయల్స్ కేవలం 12.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసి విజయం సాధించింది. వారు 47 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్ ను ముగించారు.



# డబ్ల్యూటీటీ కంటెండర్ ట్యూనిషియా

## రన్నరప్‌గా మనూష్-దివ్య జోడీ..

## పురుషుల డబుల్స్ ఫైనల్లో మనూష్-హర్మీత్!



**ఢిల్లీ:** ట్యూనిషియా వేదికగా జరుగుతున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ ట్యూనిస్-2026 టోర్నీలో భారత ప్యాడ్లర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ఆదివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌లో భారత అగ్రశ్రేణి జోడీ మనూష్ షా, దివ్య చిటాలె పోరాడి ఓడి రన్నరప్‌గా నిలిచారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ తుది పోరులో స్పెయిన్‌కు చెందిన అల్వారో రుబెల్స్, మరియా షావో జోడీ 3-1 (11-9, 11-13, 12-10, 11-5) తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. తొలి గేమ్ కోల్పోయిన తర్వాత రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం స్కోరును సమం చేసినప్పటికీ, నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పాయింట్ల వేటలో వెనుకబడి రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ఇప్పటికే మస్కట్ కంటెండర్ టైటిల్ గెలిచిన మనూష్-దివ్య జోడీకి ఇది మరో మెరుగైన ఫలితం.

### పురుషుల డబుల్స్‌లో టైటిల్ వేట:

మరోవైపు పురుషుల డబుల్స్‌లో మనూష్ షా, హర్మీత్ దేశాయ్ జోడీ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శనివారం రాత్రి జరిగిన సెమీఫైనల్‌లో భారత జోడీల మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఇందులో రెండో సీడ్ మనూష్-హర్మీత్ ద్వయం 3-2 (9-11, 5-11, 11-7, 11-5, 11-8) తేడాతో భారత్‌కే చెందిన స్నేహిత్-ఆకాష్ జోడీపై అద్భుతమైన 'కమ్ బ్యాక్' విజయాన్ని నమోదు చేసింది. తొలి రెండు గేమ్‌లు కోల్పోయినప్పటికీ, పట్టువదలని విక్రమార్కుల్లా వరుసగా మూడు గేమ్‌లు గెలిచి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఫైనల్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఫ్లోరియన్ బౌరాసాడ్, ఎస్టెబన్ డోర్ జోడీతో వీరు తలపడ్డారు.

# ప్రజ్ఞానంద బోణీ..

## అనీశ్ గిరిపై విజయం

**సైప్రస్ :** ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద అదిరిపోయే బోణీ కొట్టాడు. ఆదివారం జరిగిన ఓపెన్ కేటగిరీ తొలి పోరులో ప్రజ్ఞానంద 1-0 తేడాతో నెదర్లాండ్స్ జీఎం అనీశ్ గిరిపై అద్భుత విజయం సాధించాడు. తన కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న గిరిపై ప్రజ్ఞానంద తనదైన ఆధిపత్యం ప్రదర్శించాడు. గేమ్‌లో ఒక దశలో గిరి ఆధిక్యం కనబరిచినా అతను చేసిన తప్పిదాన్ని అనుకూలంగా మలుచుకున్న ప్రజ్ఞానంద విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు మహిళల కేటగిరీలో దివ్యాదేశ్‌ముఖ్..అన్నా ముజుచిక్‌తో గేమ్ డ్రా చేసుకోగా, వైశాలి రాంబాబు, బిబిసారా అసబుయేయా మధ్య గేమ్ డ్రాగా ముగిసింది.






## సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.



## చిరుతో మరోమారు బాబీ సినిమా

మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.

## ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం

విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.





## సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.




## ఓటీటీలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్ధపూసని

శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్ధపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ప్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేడని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.

## రూ.1,365 కోట్లు సాధించిన ధురంధర్ 2

### దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి

రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని



చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు. కళ్లెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN,** PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN**, RNI. NO. **TELTEL/2006/16536**